

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 14-09-2026 | సంపుటి - 31 | సంచిక - 112 | రూ : 4 | పేజీలు: 8


## 'అధిక'ధరకు

# కరెంటు కొంటూరా!

### సెకీ టెండర్లలో యూనిట్ రేటు రూ.5.99

- రాష్ట్ర ఈఆర్‌సీ అనుమతించిన ధర రూ.5.33
- జెన్‌కో మాత్రం రూ.6.65కి కొనేందుకు ప్రైవేటు సంస్థతో టెండర్!



హైదరాబాద్: సాధారణంగా ఎవరైనా ఏదైనా వీలయినంత తక్కువ ధరకే కొనాలని చూస్తారు. కానీ అందుకు భిన్నంగా తెలంగాణ జెన్‌కో చేపడుతున్న విద్యుత్ కొనుగోలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కరెంటు కొనుగోలుకు డిస్కంలు జాతీయ సగటు ధరలను ప్రాతిపదికగా తీసుకోవాలనేది ఆనవాయితీ. తరువాయి 2లో



# చైనా మరో ఘనత

- అంతరిక్ష మౌలిక వసతుల్లో రెండో స్థానం
- టాప్-10లో భారత్‌కు చోటు

బీజింగ్ : అంతరిక్ష రంగంలో వేగంగా దూసుకెళ్తున్న చైనా మరో కీలక ఘనత సాధించింది. ప్రపంచ అంతరిక్ష మౌలిక వసతుల నిర్మాణంలో రెండో స్థానంలో నిలిచింది. తాజా అంతర్జాతీయ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా అగ్రస్థానంలో ఉండగా, జపాన్, రష్యా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, భారత్, ఇటలీ, నెదర్లాండ్స్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. భవిష్యత్ డిజిటల్ తరువాయి 2లో






# మోదీ మారథాన్ దౌత్యం..

## రెండున్నర రోజుల్లో 15 భేటీలు!

- సదస్సుతో పాటు 15 భేటీల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- రష్యా, చైనా అధ్యక్షులతో పాటు పలువురు ప్రపంచ నేతలతో చర్చలు
- మూడు రోజుల పాటు విరామం లేకుండా కొనసాగిన సమావేశాలు
- భారత్ దౌత్యపరమైన క్రియాశీలతకు నిదర్శనంగా నిలిచిన సదస్సు



ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు, ఆయన నిబద్ధతకు అద్దం పట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కేవలం రెండున్నర రోజుల వ్యవధిలో, ప్రధాని మోదీ ఏకంగా 15 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి తన దౌత్య వేగాన్ని తరువాయి 2లో

# న్యాయం అందించడంలో వేగం పెరగాలి



- హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్
- మేడ్చల్ కోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

హైదరాబాద్ : న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల కల్పనే కాకుండా సత్వర, పారదర్శక న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో నూతనంగా నిర్మించనున్న ఆధునిక కోర్టు సముదాయానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తరువాయి 2లో



### తెలంగాణ ధనిక రాష్ట్రం..

# అది రోశయ్య చలవే

- రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని వెల్లడి
- తన ఎదుగుదలకు రోశయ్య సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్న సీఎం
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహ ఏర్పాటును సమర్థించిన రేవంత్
- ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వ సాయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తరువాయి 2లో



## సౌదీకి షాక్

# ఎర్ర సముద్రంలో హౌతీల ముప్పు

- ఎర్ర సముద్ర తీరంలో వేగంగా బలపడుతున్న హౌతీ రెబల్స్
- కీలకమైన మోఖా పోర్టు, పెరిమ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న హౌతీలు
- డ్రోన్ దాడులతో సౌదీ తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ మూసివేత
- సౌదీ చమురు ఎగుమతులపై తీవ్ర ప్రభావం, తగ్గిన సరఫరా
- అంతర్జాతీయంగా 100 డాలర్లు దాటిన ముడిచమురు ధరలు

2లో

### ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం..

# 130 మంది గల్లంతు

- జావా సముద్రంలో మునిగిన ఇండోనేషియా ప్యాసింజర్ నౌక
- ప్రమాదంలో 130 మంది గల్లంతు, 6గురు మృతి
- 107 మందిని సురక్షితంగా కాపాడిన సహాయక బృందాలు
- భారీ అలల కారణంగానే నౌక బోల్తా పడిందని వెల్లడి
- గల్లంతైన వారి బంధువుల ఆందోళనతో పోర్టు వద్ద ఉద్రిక్తత




2లో

## బ్రిక్స్ సదస్సు సక్సెస్

# పశ్చిమాసియాపై ఉమ్మడి ప్రకటన



- ఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సులో కీలక ఉమ్మడి ప్రకటన వెల్లడి
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సంయమనం పాటించాలని దేశాలకు పిలుపు
- ప్రధాని మోదీ దౌత్య చొరవతో భిన్నాభిప్రాయాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- బ్రిక్స్ కూటమికి 20 ఏళ్ల భవిష్యత్ విజన్ అవసరమన్న ప్రధాని మోదీ
- సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి సంకేతంగా విశ్లేషించిన యూఎస్ మీడియా

2లో

# బ్రిక్స్ సదస్సు సక్సెస్.. పశ్చిమాసియాపై ఉమ్మడి ప్రకటన

భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి, ఒక బలమైన ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక దౌత్య విజయం సాధించారు. భారత్ చొరవతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది. సదస్సులో 10 పూర్తిస్థాయి సభ్య దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా పాల్గొంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా సంయుక్త తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ తీర్మానంలో ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు పాల్పడవద్దని పిలుపునిచ్చాయి. పౌర మౌలిక సదుపాయాలు, అణు కేంద్రాలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు 'జపాన్ టైమ్స్' తన కథనంలో హైలైట్ చేసింది. ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగకుండా చూసేందుకు సమష్టి కృషి అవసరమని ఈ ప్రకటన నొక్కి చెప్పిందని 'అల్ జజీరా' పేర్కొంది. సదస్సు ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోదీ, బ్రిక్స్ కూటమికి రాబోయే 20 ఏళ్లకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక విజన్‌తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తీసుకున్న నిర్ణయాల అమలుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ నివేదించింది. గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ ప్రపంచ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఎవరితోనూ ఘర్షణ ద్వారా కాకుండా, అందరినీ కలుపుకొని అభివృద్ధిని కోరుకుంటున్నాం" అని మోదీ అన్నారు. మరోవైపు, బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ కూడా ఈ సదస్సులో కీలక పాత్ర పోషించింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సాంకేతికత, అభివృద్ధి సవాళ్లపై వ్యాపార ప్రముఖులు, మంత్రులు, దేశాధినేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు యురేషియా రివ్యూ నివేదించింది. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రమాణాల సహకారం వంటి అంశాలపై ఈ ఫోరమ్ సిఫార్సులు సదస్సు ప్రకటనలలో ప్రతిబింబిస్తాయి. ప్రముఖ అమెరికన్ వార్తాపత్రికలు సైతం ఈ సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి ఒక సూచికగా అభివర్ణించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లలో ఎవరి గొంతు బలంగా వినిపిస్తుందనేది ఈ సదస్సులో ప్రధానాంశమని 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. అమెరికాతో భారత్, చైనాల సంబంధాలలో ఉన్న అనిశ్చితి, ఈ రెండు అణ్వస్త్ర పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి అవకాశం కల్పించిందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' విశ్లేషించింది.

# న్యాయం అందించడంలో వేగం పెరగాలి

హైదరాబాద్: న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల కల్పనే కాకుండా సత్వర, పారదర్శక న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో నూతనంగా నిర్మించనున్న ఆధునిక కోర్టు సముదాయానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్ర ప్రభుత్వం ఈ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి ఐదెకరాల స్థలంతోపాటు రూ.117 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. న్యాయ నిర్మాణ్ ప్రణాళికలో భాగంగా నిర్మిస్తున్న ఈ సముదాయంలో ఫ్యామిలీ, పోక్సో కోర్టులతో సహా మొత్తం 16 కోర్టు హాళ్లు రానున్నాయి. మేడ్చల్ జిల్లాలో పెరుగుతున్న కేసుల దృష్ట్యా ఇక్కడ న్యాయాధికారుల సంఖ్యను పెంచే అంశంపై హైకోర్టు చురుగ్గా పనిచేస్తోంది. కేసులను వేగంగా పరిష్కరించే లక్ష్యంతో బెంచ్, బార్ కలిసి పనిచేయాలి. పరిపాలనలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఎంత ముఖ్యమో, న్యాయవ్యవస్థలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ జస్టిస్' కూడా అంతే ముఖ్యం. నూతన నేర చట్టాల అమలు నేపథ్యంలో కేసుల వేగవంతమైన పరిష్కారానికి క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్, ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి సాంకేతిక సాధనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి' అని జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ సూచించారు.

# సౌదీకి షాక్ ఎర్ర సముద్రంలో హౌతీల ముప్పు

సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల విషయంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు, మరోవైపు ఇరాకీ మిలిటెంట్ల డ్రోన్ దాడులతో పాటు తాజాగా యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రంలో పట్టు బిగించడం రియాద్‌ను ఇరకాటంలోకి నెట్టింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన రెండు ప్రధాన మార్గాలు ఏకకాలంలో ప్రమాదంలో పడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ మద్దతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవలి కాలంలో ఎర్ర సముద్ర తీరంలో వేగంగా ముందుకు సాగుతున్నారు. కొన్ని రోజుల క్రితం కీలకమైన మోఖా ఓడరేవును, బాబ్ అల్‌మండబ్ జలసంధికి సమీపంలో ఉన్న పెరిమ్ ద్వీపాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యతో ప్రపంచ చమురు, వాణిజ్య నౌకలకు అత్యంత ముఖ్యమైన బాబ్ అల్ మండబ్ జలసంధిపై వారి నియంత్రణ మరింత పెరిగింది. ఇదివరకు హర్మూజ్ జలసంధిలో సమస్యలు తలెత్తినప్పుడు, సౌదీ అరేబియా తన తూర్పు తీరంలోని చమురు క్షేత్రాల నుంచి ఎర్ర సముద్ర తీరానికి పైప్‌లైన్‌ల ద్వారా ముడి చమురును రవాణా చేసి ఎగుమతులు చేసేది. ఇప్పుడు ఆ మార్గానికే హౌతీల రూపంలో ముప్పు ఏర్పడింది.

దీనికి తోడు, శుక్రవారం ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్లు డ్రోన్లతో దాడి చేయడంతో సౌదీ తన తూర్పుపశ్చిమ పైప్‌లైన్‌ను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ఈ డ్రోన్ దాడులకు హౌతీలు సహకరించారని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాల కారణంగా ఆసియా దేశాలకు సౌదీ చేసే చమురు ఎగుమతులు భారీగా పడిపోయాయి. జూన్‌లో రోజుకు 34 లక్షల బ్యారెళ్లుగా ఉన్న ఎగుమతులు, ఆగస్టు నాటికి కేవలం 1.28 లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. ఈ నెలలో కాస్త కోలుకుని రోజుకు 7 లక్షల బ్యారెళ్లకు చేరాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సౌదీ అరేబియా ముందున్న మార్గాలు పరిమితంగానే ఉన్నాయి. సైనిక చర్యకు దిగితే, వివాదం మరింత ముదిరి తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉంది. దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తే ఇరాన్, హౌతీల నుంచి కఠినమైన షరతులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు, ఈ విషయంలో అమెరికా మద్దతు కూడా అనిశ్చితంగానే ఉంది. పశ్చిమాసియాలో మరో యుద్ధంలో జోక్యం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుముఖంగా లేరని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరింది. తమ దేశాన్ని రక్షించుకోవడంతో పాటు, ఎర్ర సముద్రంలో నౌకాయాన స్వేచ్ఛను కాపాడేందుకు భాగస్వామ్య

# 'అధిక' ధరకు కరెంటు కొంటారా!

హైదరాబాద్: సాధారణంగా ఎవరైనా ఏదైనా వీలయినంత తక్కువ ధరకే కొనాలని చూస్తారు. కానీ అందుకు భిన్నంగా తెలంగాణ జెన్‌కో చేపడుతున్న విద్యుత్ కొనుగోలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కరెంటు కొనుగోలుకు డిస్కంలు జాతీయ సగటు ధరలను ప్రాతిపదికగా తీసుకోవాలనేది ఆనవాయితీ. పునరుద్ధరణీయ ఇంధన (ఆర్‌ఈ) ప్లాంట్ల నుంచి కరెంటు కొనుగోలుకు 'భారత సౌర విద్యుత్ సంస్థ(సెకీ)' ఇటీవల జాతీయస్థాయిలో పిలిచిన టెండర్లలో ఒక యూనిట్ కరెంటు కొనుగోలు ధర రూ.5.26కే ఖరారైంది. ఆర్‌ఈ అంటే పగలు మాత్రమే వచ్చే సౌరవిద్యుత్ కాకుండా రాత్రిపూట కూడా కలిపి (24 గంటలూ) కరెంటు సరఫరా చేయాలని సెకీ టెండర్లలో నిబంధన పెట్టింది. అంటే పగలు సౌర విద్యుత్, రాత్రిపూట బ్యాటరీ ఎనర్జీ నిల్వ వ్యవస్థ (బెస్) లేదా పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంటు (పీఎస్‌పీ) నుంచి కరెంటు సరఫరా చేయాల్సి ఉంటుంది. టెండర్లలో ఈ ధర (రూ.5.26)నే ప్రాతిపదికగా తీసుకుని.. వీలైతే అంతకన్నా తక్కువ రేటుకే అన్ని రాష్ట్రాల డిస్కంలు కరెంటు కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. రోజూ ఉదయం, సాయంత్రం 7 నుంచి 11లోపు కొన్ని గంటల సమయం మాత్రమే రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. అంటే ఈ సమయంలో అన్నివర్గాల వారు కరెంటు వినియోగించడం వల్ల భారీగా కరెంటు సరఫరాకు తెలంగాణ డిస్కంలు సిద్ధంగా ఉండాలి. ఇలా గరిష్ఠ డిమాండ్ ఉన్న సమయంలో 'భారత ఇంధన ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్)' నుంచి ఒక యూనిట్ కరెంటును రూ.10 వరకూ చెల్లించి రాష్ట్ర డిస్కంలు కొంటున్నాయి. దీనివల్ల భారీగా ఆర్థిక భారం పడుతుండటంతో అన్ని రాష్ట్రాల డిస్కంలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. అయితే ఇలా గరిష్ఠ డిమాండ్ ఉండే సమయంలో కరెంటు సరఫరాకు సెకీ తాజాగా టెండర్లు పిలవగా యూనిట్ రూ.5.99కే ఇస్తామని ఒక కంపెనీ ముందుకొచ్చింది.

# మోదీ మారథాన్ దౌత్యం.. రెండున్నర రోజుల్లో 15 భేటీలు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు, ఆయన నిబద్ధతకు అద్దం పట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కేవలం రెండున్నర రోజుల వ్యవధిలో, ప్రధాని మోదీ ఏకంగా 15 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి తన దౌత్య వేగాన్ని చాటుకున్నారు. ఈ అధికారిక సమావేశాలే కాకుండా, బ్రిక్స్ సదస్సు సెషన్లు, ఔట్‌రీచ్ సమావేశాల మధ్యలో పలువురు ప్రపంచ నేతలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులతో కూడా ఆయన అనేక పుల్‌అసైడ్ (అనధికారిక) సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలతో ప్రధాని మోదీ ఈ దౌత్య మారథాన్‌ను ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం హైదరాబాద్ హౌస్‌లో ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో చర్చలతో రోజును ప్రారంభించిన మోదీ, ఆ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్, వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌లతో వరుసగా సమావేశమయ్యారు. అనంతరం బ్రిక్స్ సదస్సులో పాల్గొని, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కీలక ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. సదస్సులో భాగంగా 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను తిలకించడం, నేతలతో కలిసి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆదివారం కూడా ప్రధాని సమావేశాల పరంపర ఆగలేదు. బ్రిక్స్ భాగస్వామ్య, ఔట్‌రీచ్ దేశాల నేతలతో భేటీ అనంతరం, కజకిస్థాన్ ప్రధాని, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు, ఈజిప్ట్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, బురుండి అధ్యక్షుడు, నైజీరియా ఉపాధ్యక్షుడు, ఉగాండా ఉపాధ్యక్షురాలితో ఒకరి తర్వాత ఒకరితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మొత్తం మీద, బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీ చూపిన చొరవ, ఆయన జరిపిన వరుస సమావేశాలు ప్రపంచ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలన్న భారత్ సంకల్పాన్ని మరోసారి స్పష్టం చేశాయి.

# ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం.. 130 మంది గల్లంతు

ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ పెను విషాదంలో ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తూర్పు జావాలోని సురబయ నుంచి శనివారం బయలుదేరిన ఈ నౌక, దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్‌మాసిన్‌కు వెళుతోంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నౌకాదళానికి చెందిన నౌకతో సహా నాలుగు నౌకలు, ఒక హెలికాప్టర్, సమీపంలోని టగ్‌బోట్ల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కాపాడిన వారిని సమీపంలోని తూర్పు జావా పోర్టుకు తరలిస్తున్నారు. మరోవైపు, బంజర్‌మాసిన్‌లోని త్రిశక్తి పోర్టు వద్ద గల్లంతైన వారి బంధువులు వందలాదిగా గుమిగూడారు. ప్రయాణికుల జాబితాలను చూస్తూ తమ వారి క్షేమ సమాచారం కోసం తీవ్ర ఆవేదనతో ఎదురుచూస్తున్నారు. వేలాది ద్వీపాలతో కూడిన ఇండోనేషియాలో రవాణాకు ఫెర్రీలపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే, భద్రతా లోపాల కారణంగా ఇక్కడ తరచూ ఇలాంటి సముద్ర ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, అధికారిక రికార్డుల్లో ఉన్న ప్రయాణికుల సంఖ్యకు, వాస్తవంగా నౌకలో ఉన్నవారి సంఖ్యకు తేడా ఉండటం ఇక్కడ సర్వసాధారణమని, దీంతో గల్లంతైన వారి కచ్చితమైన సంఖ్యను నిర్ధారించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.

## తెలంగాణ ధనిక రాష్ట్రం..

# అది రోశయ్య చలవే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్యవైశ్యులు సౌమ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు ఆర్యవైశ్య వర్గానికి చెందినవారేనని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదని పేర్కొన్న సీఎం, ఈ ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల అవసరాలు తీర్చాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# చైనా మరో ఘనత

బీజింగ్ : అంతరిక్ష రంగంలో వేగంగా దూసుకెళ్తున్న చైనా మరో కీలక ఘనత సాధించింది. ప్రపంచ అంతరిక్ష మౌలిక వసతుల నిర్మాణంలో రెండో స్థానంలో నిలిచింది. తాజా అంతర్జాతీయ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా అగ్రస్థానంలో ఉండగా, జపాన్, రష్యా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, భారత్, ఇటలీ, నెదర్లాండ్స్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో అంతరిక్ష మౌలిక వసతులు మరింతగా మమేకం కానుండటంతో.. రాబోయే దశాబ్దంలో ఈ రంగం ప్రపంచ భౌగోళికరాజకీయ, సాంకేతిక పోటీకి ప్రధాన వేదికగా మారనుందని నివేదిక పేర్కొంది. బీజింగ్‌లో జరిగిన 2026 చైనా అంతర్జాతీయ సేవల వాణిజ్య ప్రదర్శన సందర్భంగా 2026 గ్లోబల్ స్పేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెస్‌మెంట్ః నివేదికను విడుదల చేశారు. అంతరిక్షంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానానికి అవసరమైన మౌలిక వసతుల ఆధారంగా ప్రపంచంలోని 48 ఆర్థిక వ్యవస్థలను ఈ నివేదిక అంచనా వేసింది. అంతరిక్ష మౌలిక వసతుల అంచనాలో హార్డ్‌వేర్‌తోపాటు సాఫ్ట్‌వేర్ అంశాలనూ పరిగణనలోకి తీసుకున్నారు. జీవన సహాయక వ్యవస్థలు, ప్రయోగరవాణా వ్యవస్థలు, సమాచార వ్యవస్థలు, ఇంధన వనరులు, చట్టాలు, నిబంధనలు, వివాదాల పరిష్కార యంత్రాంగాలు వంటి కీలక అంశాలను పరిశీలించారు.

**హార్డ్ పవర్‌లో అమెరికా-చైనా ఆధిపత్యం**

అంతరిక్ష రంగానికి సంబంధించిన సాంకేతిక, భౌతిక సామర్థ్యాల పరంగా అమెరికా, చైనా ముందంజలో ఉన్నాయని నివేదిక వెల్లడించింది. రష్యా, జపాన్, బ్రిటన్, భారత్ కూడా ఈ రంగంలో పోటీతత్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని పేర్కొంది. అంతరిక్ష రంగంలోని చట్టాలు, విధానాలు, అంతర్జాతీయ సహకారం, నియంత్రణ వ్యవస్థలు వంటి సాఫ్ట్ పవర్ అంశాల్లో ఫ్రాన్స్, అమెరికా, చైనా, రష్యా, ఇటలీ అగ్రస్థానాల్లో ఉన్నాయి.

**2035 వరకు చంద్రుడి పరిసరాలపైనే దృష్టి**

2035 వరకు మానవ అంతరిక్ష కార్యకలాపాలు ప్రధానంగా భూమిచంద్రుడి మధ్య, చంద్రుడి పరిసర ప్రాంతంలోనే కేంద్రీకృతమై ఉంటాయని నివేదిక అంచనా వేసింది. దీనిని సిస్లూనార్ స్పేస్ అని పిలుస్తారు. 2040 తర్వాత భూమి నుంచి అంగారక గ్రహం వరకు ఉన్న అంతరిక్ష ప్రాంత అభివృద్ధి సాధ్యమయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ, సమీప భవిష్యత్తులో గ్రహాల మధ్య అంతరిక్షాన్ని భారీ స్థాయిలో వినియోగించడం సాధ్యం కాదని నివేదిక స్పష్టం చేసింది. బాహ్య అంతరిక్షం భవిష్యత్తులో భౌగోళిక రాజకీయాలు, అత్యాధునిక సాంకేతికతల మధ్య పోటీకి కొత్త వేదికగా మారనుందని పేర్కొంది.

**వచ్చే పదేండ్లలో మరింత తీవ్ర పోటీ**

బీజింగ్ అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్ అసోసియేట్ రీసెర్చ్ ఫెలో వాంగ్ పెంగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అంతరిక్ష పరిశ్రమ భారీ స్థాయిలో ఉపగ్రహ సమూహాలను ఏర్పాటు చేసే ప్రారంభ దశలోనే ఉందన్నారు. అయితే రాబోయే పదేండ్లలో ఈ రంగంలో పోటీ మరింత తీవ్రంగా మారుతుందని చెప్పారు. భూమిచంద్రుడి పరిసర అంతరిక్షం ప్రపంచ దేశాల మధ్య ప్రధాన పోటీ వేదికగా మారే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

## సమాజ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

* బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : సమాజ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ సుభాష్ నగర్ లోని అయిమాత దేవాలయంలో సిర్వీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "అయిమాత అమ్మవారి 611వ జయంతి & దేవాలయ 23వ వార్షికోత్సవ వేడుకలకు" బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయి మాత కృపా కటాక్షాలు, సిర్వి సమాజ్ సంపూర్ణ మద్దతుతో నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన మీకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిర్వి సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిర్వి సమాజ్ అధ్యక్షులు రావత్ రాంజీ బర్వా, ఉపాధ్యక్షులు సోహన్ లాల్జీ పరిహార్, దుర్గా రాంజీ ములేవా, కార్యదర్శి ప్రేమ్ పావార్, జాయింట్ సెక్రెటరీ మంగల్ పావార్, ట్రెజరర్ పవర్ లాల్ ఖగ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడకండి... ఆదుకుంటాం

* షార్ట్ సర్క్యూట్ తో నష్టపోయిన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని అందించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : అకస్మాత్తుగా జరిగిన విద్యుత్ ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన శ్రీనివాస్ అధైర్యపడవద్దని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డి నగర్ లో ఈనెల 11వ తేదీన సాయంత్రం 7.00 గంటలకు ఇంట్లో జరిగిన ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన బాధితుడు రెడ్డి ల్యాబ్ శ్రీనివాస్ ఇంటిని ఆదివారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ స్థానిక నాయకులతో కలిసి ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో తీవ్రంగా నష్టపోయిన బాధితులు శ్రీనివాస్ కు వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని ఫోన్ ద్వారా అధికారులను ఎమ్మెల్యే గారు ఆదేశించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకుంటామని, విద్యుత్ అధికారులతో చర్చించి బాధితుడికి నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు.

## ఘనంగా ఠాగూర్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ బండారి ఉమారాణి జయంతి వేడుకలు




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయి కుమార్ సతీమణి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ బండారి ఉమారాణి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లోని ఠాగూర్స్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఆమె చిత్ర పటానికి ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయి కుమార్ తో పాటు కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం పారిశుద్య సిబ్బందికి, పాఠశాల ఆయాలకు దుస్తులు, స్వీట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నేహ, కుటుంబ సభ్యులు బండారి శివకుమార్, బండారి ఉషారాణి, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇక్కుర్తి నారాయణరావు, బిర్జు సింగ్, ఉపాధ్యాయులు ఆర్. శివ గోపి, విజయ భారతి, యామిని, పి. చందు, విద్యార్థులు దాలి, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కోల కుమార్ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దళిత జర్నలిస్ట్ ఫోరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా జర్నలిస్ట్ కోల కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కాశపోగు జాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. డేవిడ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం టీయూడబ్ల్యూజే-ఐజేయూ జర్నలిస్టుల యూనియన్ కొత్తగూడెం డివిజన్ ఉపాధ్యక్షులుగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని దళిత జర్నలిస్టులను ఐక్యం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలనే లక్ష్యంతో కోల కుమార్ ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకత్వం తెలిపింది. ఈ సందర్భంగా కోల కుమార్ మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే-ఐజేయూ జర్నలిస్టుల యూనియన్ సహకారంతో దళిత జర్నలిస్ట్ ఫోరం తరఫున దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయ సంస్కృతిని, కళలను ప్రపంచవ్యాప్తంగా విస్తృత పర్చేందుకు ఇస్కప్ కృషి

* హైకోర్టు న్యాయవాది, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు




నల్గొండ, ప్రజాస్ఫూర్తి : భారతీయ సంస్కృతిని, కళలను ప్రపంచవ్యాప్తంగా. విస్తృతపర్చేందుకు భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కప్) కృషి చేస్తుందని హైకోర్టు న్యాయవాది, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు పేర్కొన్నారు. ఆదివారం నల్గొండ లోని ఐఎంఏ హాల్లో ఇస్కఫ్ నల్గొండ జిల్లా మహాసభలు డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాలు ఆంధ్ర రాజ్యాల దురాక్రమలను ప్రశ్నించడం ను హర్షించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సైతం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంకులలో తగిన స్థానం కోరటం సహితమైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు కారింగు బిక్షమయ్య, కరీం, కోశాధికారి అవ్వ విజయలక్ష్మి ,న్యాయవాదులు మునగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు, కట్ట అనంతరెడ్డి, కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు ఆర్ రమేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఇస్కాఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, కోశాధికారిగా బి రామలింగం లతో పాటు 35 మందితో జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## హక్కుల సాధనే లక్ష్యం

* కుమ్మరి సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలోని కుమ్మరుల హక్కుల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర కుమ్మరి సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఏడుకొండల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన గరిడేపల్లి లోని ఎంబిఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్వహించిన మండల కుమ్మరి సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కుమ్మరుల హక్కుల సాధన లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. కుమ్మరుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బిసి బీగా ఉన్న దానిని బిసి ఏ గా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ దేవతల వద్ద పూజలు, నైవేద్యాలు నిర్వహించే కుమ్మరులకు నెలసరి గౌరవ వేతనాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి హక్కులను సంఘటితంగా పోరాడేందుకు కృషి చేయాలని కోరారు. మొదట గరిడేపల్లి మండల సంఘం నూతన కమిటీని నియమించారు. మండల సంఘం అధ్యక్షులుగా కొలిపాక శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం పాటి జానకి రాములు, కోశాధికారిగా కొలిపాక కృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కడారు వెంకటేశ్వర్లు, గుమ్మడి రాములు, జానకి రాములు, ప్రచార కార్యదర్శులుగా సలి కంటి ప్రసాద్, సలికంటి నరేష్, మధు ఎంపిక కాగా, మహిళా విభాగం మండల అధ్యక్షురాలుగా కొలిపాక మంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా మడిపడిగా స్వప్న, యువజన విభాగం అధ్యక్షులుగా కానుగు విజయ్, ప్రధాన కార్యదర్శిగా కోట సతీష్, సహాయ కార్యదర్శిలుగా మామిడి వీరబాబు, గుమ్మడిల్లి కరుణాకర్, ప్రచార కార్యదర్శిగా కడారు హరీష్ ఎన్నికయ్యారు. హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి గొట్టం సంజీవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యాపేట జిల్లా సంఘం కన్వీనర్ సలికంటి నరేష్, జిల్లా కో కన్వీనర్లు మాసంపల్లి సైదులు, మధుసూదన్, సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జి సలికంటి వీరేంద్ర, సంఘం వృత్తి విభాగం అధ్యక్షులు కాసుల లింగయ్య, సూర్యాపేట పట్టణ అధ్యక్షులు సలికంటి నాగయ్య తో పాటు పలువురు సంఘం నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి ఆర్. కృష్ణయ్య సేవలు బీసీ సమాజం ఎప్పటికీ మరవదు

* బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి ఆర్. కృష్ణయ్య సేవలు బీసీ సమాజం ఎప్పటికీ మరవదని బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ అన్నారు. ఆదివారం ముస్తాబాద్ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను బీసీ టీచర్ అసోసియేషన్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆర్. కృష్ణయ్య బీసీ హక్కుల కోసం దశాబ్దాలుగా ఉద్యమాలు చేస్తూ వెనుకబడిన తరగతుల విద్యార్థీల కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసిన గొప్ప నాయకుడని, బీసీల అభివృద్ధికి, విద్యార్థుల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ కోసం కృషి చేసిన మహనీయుడని, అనునిత్యం నిరుద్యోగ, విద్యార్థుల సమస్యల కోసం పోరాడే మన ప్రజా నాయకుడని తెలిపారు. ఈ వేడుకల్లో బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్, బీసీటీఏ రాష్ట్ర కార్యదర్శి బి. మలేషం, జె. శ్రీనివాస్, బీసీ నాయకులు మెరుగు అంజాగౌడ్, కె. పరశురాములు, రామచంద్రం, ఎ. లక్ష్మణ్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడి నూతన ఏసి ఎస్, చైర్మన్, సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలంలో ఇటీవల పి ఏ సి ఎస్,చైర్మన్‌గా నియమితులైన చిట్టుమల్ల రవీందర్ తో పాటు నూతనంగా నియమితులైన సభ్యులు హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన పి ఏ సి ఎస్, చైర్మన్, సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమను బాధ్యతల్లోకి తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన పి ఏ సి ఎస్ ,చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ తో పాటు సభ్యులను అభినందించారు. రైతుల సంక్షేమం, సహకార రంగం బలోపేతం కోసం సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.పి ఏ సి ఎస్, ద్వారా రైతులకు అవసరమైన సేవలు మరింత మెరుగ్గా అందేలా కృషి చేయాలని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని మంత్రి ఆకాంక్షించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతుల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: చుంచుపల్లి మండలం రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అభిలాష్, స్వరాజ్, యశ్విక్, హస్విత్ సాయి రాష్ట్రస్థాయి సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టరెస్ శ్రీమతి కవిత, కోచ్ పొన్నాల పృథ్వీరాజ్ తెలిపారు. సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక ట్రయల్స్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారి అద్భుతమైన ఆటతీరును పరిగణనలోకి తీసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బాలాజీ, రుద్రంపూర్ సర్పంచ్ కేస్లీ, వైస్ సర్పంచ్ తోట రాజు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రజాక్, మదర్ థెరిసా ట్రస్ట్ వ్యవస్థాపకులు యాకయ్య, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి పాఠశాలకు, రుద్రంపూర్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

* బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ బాంబే హౌస్ కాలనీ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘం సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు పి.కన్నప్ప రాజు, ప్రధాన కార్యదర్శి ఎండి. మునీర్, వి . నరసింహ, కోశాధికారి కందుకూరి రవి, సలహాదారులు దేశినేని త్రివేణి, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, షాహెన్, కె.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తుడుం దెబ్బ జన్నారం మండల నూతన అధ్యక్షుడిగా మర్స్ కోల వసంత్



ప్రజాస్ఫూర్తి ,జన్నారం: ఆదివాసి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జన్నారం మండల నూతన అధ్యక్షుడిగా మరుసుకోల వసంత్ ను ఆదివారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జన్నారం మండల ఆదివాసి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా తుమ్రం లక్ష్మణ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, విద్య, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆదివాసి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.నూతన అధ్యక్షుల ఎన్నిక పట్ల ఆదివాసి సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

## శివాని ధాభా ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ బైపాస్‌రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శివాని ధాబాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరునాయక్ మాట్లాడుతూ వినియోగదారులకు రుచికరమైన వంటకాలను అందచేయాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాళోత్ గాంధీ నాయక్, వాంకుడోత్ శ్రీను, లచ్చు, గణేష్, దినేష్, వెంకన్న, శ్రీను, సతీష్, లక్ష్మణ్, శశాంక్, మహాలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణం వందే జగద్గురుమ్ 2026 కార్యక్రమం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : శ్రీ కృష్ణా జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సోసైటి , సిరి ఆర్ట్స్ అకాడమి సంయుక్తంగా నిర్వహించిన కృష్ణం వందే జగద్గురుమ్ 2026 కార్యక్రమం నగరంలోని రవీంద్ర భారతీ మెయిన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ అండ్ అర్గనైజర్ ఎం.వీరేష్ యాదవ్ పాల్గొని చిన్నారులు ప్రదర్శించిన కళా ప్రదర్శనను తిలకించారు. అనంతరం గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా కళా ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులను అందజేశారు.

# వాకింగ్ తో సంపూర్ణ ఆరోగ్యం ఐక్యతే మన బలం



తొర్రూర్, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రతిరోజూ వాకింగ్ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని యూనిటీ వాకర్స్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసు అన్నారు.తొర్రూర్ లోని ఆర్ఎన్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం యూనిటీ వాకర్స్ సొసైటీ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.యూనిటీ అంటేనే ఐక్యత అని,ఐక్యతే వాకర్స్ సొసైటీకి ప్రధాన బలమని పేర్కొన్నారు. గతంలో సొసైటీ చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ,కొత్తగా ఎన్నికైన కమిటీ మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

**నూతన కార్యవర్గం:**

అధ్యక్షుడిగా మైదం దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రెడ్యా, కోశాధికారిగా సీహెచ్ స్వామి, ఉపాధ్యక్షుడిగా ఓంప్రకాశ్,జాయింట్ సెక్రటరీగా పి. నాగరాజు,మీడియా కన్వీనర్ గా కె. ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా కొత్తగట్టు కృష్ణ, సలుగు నాగన్న, గుర్రం వెంకన్న వ్యవహరించనున్నారు.

# సీసీ రోడ్డు పనులను పరిశీలించిన

* **మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణం నవాపేట్ వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు పనులు నాణ్యత తో చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల సమయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని నరేష్ గౌడ్ తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి




భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా యంత్రాంగం మార్గదర్శకాలను పాటిస్తూ భక్తి, భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వినాయక చవితి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు.

# కేటీఆర్ పీఏ, పీఆర్వోలకు పోలీసుల నోటీసులు




హైదరాబాద్: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌కు సైఫాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఇద్దరికీ ఉన్నత న్యాయస్థానం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం సైఫాబాద్ పీఎస్‌లో విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులిచ్చారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

* **ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**




ప్రజా స్ఫూర్తి, భైంసా: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం భైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన సంవత్సరం తర్వాతనిజాం పాలన నుండి విముక్తి లభించిందని,ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహించకపోవడం సరియైనది కాదన్నారు. సెప్టెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలు నిర్వహించాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 17వ తేదీన బిజెపి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన జాతీయ జెండాలు ఎగరవేస్తామన్నారు. మహారాష్ట్ర కర్ణాటక ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వర్గం మెప్పుకోసం అధికారికంగా చేపట్టకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా రెడ్డి, సీనియర్ నాయకులు సాంప్లీ రమేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, భైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి తదితరులున్నారు.

# అటకెక్కిన నాలుగో నంబర్ ప్లాట్ ఫారం?

* **వృద్ధులు,గర్భిణీల అవస్థలు ఎవరు పట్టించుకోవాలి?**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ రైల్వే స్టేషన్లో నాలుగో నంబర్ ప్లాట్ ఫారం అటకెక్కినట్టేనా? అంటే అవుననేలా అధికారుల తీరు ఉందా? అని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు విమర్శించారు.దీనికి నిరసనగా ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట ఆయన నిరసన వ్యక్తం చేశారు. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న మహబూబాబాద్ స్టేషన్ అమృత్ భారత్ స్కీమ్ కింద నవీకరణ జరుగుతోందా? అని తెలిపారు. మూడో లైన్ రాకతో స్టేషన్ రూపురేఖలు మారిపోయాయని, ఈ క్రమంలో నాలుగో ప్లాట్ ఫారం నిర్మించాల్సి ఉందా? అన్నారు. మొదట 150 మీటర్లతో బేబీ ప్లాట్ ఫారం నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నా అధికారులు పట్టించుకోకుండా అడ్డుగోడ కట్టి చేతులు దులుపుకున్నారా? అని వాపోయారు. దీంతో రైలు ఎక్కాలంటే బ్రిడ్జి మెట్లు ఎక్కి దిగాల్సిన దుస్థితి నెలకొందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వృద్ధులు,గర్భిణీ స్త్రీలు, వికలాంగులు, స్థూలకాయులు,గుండె జబ్బుల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా? అని పేర్కొన్నారు.నాలుగో లైను వస్తోందని, ఆ తర్వాతే నాలుగో ప్లాట్ ఫారం నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారా? అయితే ఆ లైను రావడానికి ఇంకో నాలుగైదేళ్లు పడుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయా? అని అన్నారు. ప్రతిరోజూ పలు రైళ్ల రాకపోకలతో నాలుగైదు వేల మంది ప్రయాణికులతో సుమారు ఆరు లక్షల రూపాయల ఆదాయం వస్తున్న స్టేషన్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు లేకపోవడం దురదృష్టకరం కాదా? అని ప్రశ్నించారు. పూర్తి స్థాయి ప్లాట్ ఫారాలు, స్టేషన్ పై కప్పులు, ఎస్కలేటర్లు లేవా? అని అన్నారు.పట్టణాన్ని రెండుగా చీలుస్తున్న రైల్వే స్టేషన్కు ఇరువైపులా పాదచారుల వంతెన నిర్మించాలా? అని డిమాండ్ చేశారు.అలాగే క్లబ్ దగ్గర మరో గేటు ఏర్పాటు చేస్తే శ్రీనివాస్ టాకీస్ వైపు రద్దీ తగ్గుతుందా? అని సూచించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయ లోపానికి అసంపూర్ణ అండర్ బ్రిడ్జి, 56 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిన ఫ్లైఓవర్ బ్రిడ్జి,ఇల్లందు కురవి రోడ్లను కలుపుతున్న తలాతోక లేని ఫ్లైఓవర్ బ్రిడ్జిలే నిదర్శనమా? అని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో గాయకులు ఆరిపాక రాజేష్, తెలంగాణ ఉద్యమ నాయకులు కరాటే ఖాజా, గంగాధరి బాలరాజు, మహ్మద్ సాధిక్,తోట శ్రీనివాస్,కన్నబాబు,కేతమ్మ, నిర్మల,లక్ష్మి,భాగ్యమ్మ, లలిత,చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

* **మేయర్ మూడ్ గణేష్**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ మూడ్ గణేష్ పాల్గొని ప్రజలకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలు,పీవోపీ తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితమై జీవరాశులకు ముప్పు వాటిల్లుతోందని , ప్రకృతికి ఎటువంటి హాని కలగకుండా సాంప్రదాయబద్ధంగా పండుగలను జరుపుకోవాలని బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. చేశారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణ హిత పద్ధతులను పాటించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిగడప పద్మ, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, బోయిన విజయ్ కుమార్, శాంతిప్రియ, శహెరా అహ్మద్, ధనలక్ష్మి, నాగలక్ష్మి, హరిత, దర్గయ్య, హిమశ్రీ, దాసరి శ్రీనివాస్, కళావతి, స్థానికులు సత్యనారాయణాచారి,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చవితి 9 రోజుల భక్తి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : 1వ రోజు తొలి పూజ: వినాయకుడిని తొలి పూజ ఎందుకు చేస్తామో తెలుసా? శివుడు గణాధిపత్యం ఇచ్చి, ఎవరైనా ఏ పని మొదలుపెట్టే ముందు నీ పూజ చేస్తేనే విజయం కలుగుతుందని వరం ఇచ్చాడు. అందుకే మంచి మనసుతో మొదలుపెట్టండి.2వ రోజు గజముఖం కథ: పార్వతీదేవి నలుగు పిండితో బాలుడిని చేసి ప్రాణం పోసింది. శివుడు కోపంతో తల ఖండించి, తర్వాత ఏనుగు తల అతికించాడు. అహంకారం వదిలి వినయంగా ఉండాలనే సందేశం ఇది.3వ రోజు మూషిక వాహనం: పెద్ద వినాయకుడికి చిన్న ఎలుక వాహనం ఎందుకు? కోరికలు ఎలుకలాంటివి, చిన్నవైనా ఇల్లంతా పాడుచేస్తాయి. వాటిని అదుపులో పెట్టుకోవాలని గుణపాఠం.4వ రోజు ఏకదంతం: పరశురాముడితో యుద్ధంలో ఒక దంతం విరిగినా, దాన్నే కలంగా చేసుకుని మహాభారతం రాశాడు. నష్టాన్ని కూడా మంచికి మార్చుకోవడమే నిజమైన జ్ఞానం.5వ రోజు మోదక ప్రియుడు: కుబేరుడు బంగారు వంటకాలు పెడితే తృప్తి పడలేదు, ఒక పేద భక్తురాలు ఇచ్చిన ఒక్క మోదకంతో కడుపు నిండింది. భక్తిలోని మనసు ముఖ్యం, ఆడంబరం కాదు.6వ రోజు తల్లిదండ్రుల ప్రదక్షిణ: కుమారస్వామి నెమలిపై లోకాన్ని చుట్టి వస్తే, వినాయకుడు తల్లిదండ్రుల చుట్టూ తిరిగి తల్లిదండ్రులే నా ప్రపంచం అన్నాడు. అమ్మానాన్నలే దైవం.7వ రోజు సిద్ధి బుద్ధి: వినాయకుడు కేవలం విఘ్నాలు తొలగించడమే కాదు, సిద్ధి (విజయం), బుద్ధి (జ్ఞానం) ఇద్దరినీ ఇచ్చే దేవుడు. మంచి ఆలోచనతో చేసే పనికి విజయం తప్పక వస్తుంది.8వ రోజు క్షమాగుణం: చంద్రుడు వినాయకుడి రూపాన్ని చూసి నవ్వితే, శపించాడు. చంద్రుడు క్షమాపణ కోరగానే కరుణించాడు. తప్పు చేసిన వారిని క్షమించే మంచి మనసు నేర్చుకోవాలి.9వ రోజు నిమజ్జనం సందేశం: మట్టి గణపతిని నీటిలో కలపడం అంటే మనం మట్టి నుంచి వచ్చి మట్టిలో కలిసిపోతామని, అహంకారం విడిచి ప్రకృతిని ప్రేమించాలని సందేశం.

# ప్రజలందరికీ గణేష్ చతుర్థి శుభాకాంక్షలు

* **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: విఘ్నేశ్వరుని కృపతో విఘ్నాలన్ని తొలగి, అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రజలందరూ ఈ పండుగను సంతోషంగా, భక్తితో జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ... గణపతి ఆశీర్వాదాలతో జిల్లాలో ప్రతి ఒక్కరికి సుఖ సంతోషాలు, శాంతి, ఆర్థిక స్థితి మెరుగుపడాలని ఆకాంక్షించారు. పర్యావరణ రక్షణ కోసం మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించుకోవాలనీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించి, నీటి కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సమయంలో స్వచ్ఛత, క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలను కోరారు.నిమజ్జనానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని ప్రజలకు తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని తెలిపారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వైకుంఠ రథం అందించిన తనయులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కంబాలపల్లి గ్రామపంచాయతీకి దివంగత పూర్వపు హెడ్మాస్టర్ కీర్తిశేషులు శ్రీరామ్ వెంకన్న సరోజిని దంపతుల కుమారులు,కంబాలపల్లి ప్రభుత్వ ఉద్యోగులు వైకుంఠ రథాన్ని అందించారు.చనిపోయిన ప్రతి వ్యక్తి చావు కూడా పెళ్లి లాంటిదే అనే విధంగా పార్థివ దేహాన్ని గౌరవంగా ఊరేగింపుతో స్మశాన వాటికకు చేర్చాలనే ఉద్దేశంతో రూ.లక్ష యాభై వేల విలువైన వైకుంఠ రథాన్ని తయారు చేయించి ఆదివారం గ్రామపంచాయతీకి అప్పగించారు.దివంగత దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీరామ్ చంద్రశేఖర్,కమలాకర్, విజయకుమార్,ప్రభుత్వ ఉద్యోగులు,రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో ఈ రథాన్ని సమకూర్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీరిక వసంత ఉపేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ కమటం యాకన్న, దాతలు రామసహాయం శ్రీధర్ రెడ్డి,కొలిశెట్టి సత్యనారాయణ, శ్రీరామ్ విజయకుమార్, గ్రామ పెద్దలు బెల్లంకొండ శ్రీనివాస్, వార్డు సభ్యులు చీరిక వేణురెడ్డి,కోమరెల్లి జైపాల్ రెడ్డి,శిరంశెట్టి వేణు,కారింగుల రాజశేఖర్,ఇందుర్తి రవీందర్ రెడ్డి,బొబ్బ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల సమస్యలు పరిష్కరిస్తాం



భూపాలపల్లి , (ప్రజా స్ఫూర్తి) : బహుజన రాజ్యాధికారం సాధించిన తర్వాత కళాకారుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలో సాంస్కృతిక, కోలాటం, భజన కళాకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కళాకారులు తమ సమస్యలను రవి పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్ల స్థలాలు, గృహ సౌకర్యం, పెన్షన్, కళాకారుల భృతి, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. దేవాలయాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కళాకారుల రాష్ట్ర నాయకులు కుడుముల కుమార్, జాతీయ అధ్యక్షుడు వీరభద్రస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు కుంట్ల ఉప్పలయ్య, మహిళా అధ్యక్షురాలు రజిత కీసర, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం లక్ష్మయ్య, జనగాం మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బందెర రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కుడుముల రామాతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు భారీ బందోబస్తు



* **మల్కాజిగిరి సీపీ సుమతి**

మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు భారీ భద్రతా, ట్రాఫిక్, శాంతిభద్రతల ఏర్పాట్లు చేపట్టినట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు."గణేష్ సురక్ష సంకల్ప్-2026" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని, "మన గణేష్-మన భద్రత" అనే నినాదంతో భక్తులు, నిర్వాహకులు బాధ్యతగా, క్రమశిక్షణతో ఉత్సవాలు నిర్వహించాలని సీపీ కోరారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 15 వేలకు పైగా గణేష్ విగ్రహాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉందని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 శాతం పెరుగుదల ఉంటుందని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సమాచారం, దరఖాస్తు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు సుమారు 6,500 ఆన్‌లైన్ దరఖాస్తులు అందినట్లు సీపీ వెల్లడించారు.ఉత్సవాల బందోబస్తు కోసం అన్ని స్థాయిలకు చెందిన 5,749 మందికి పైగా పోలీస్ సిబ్బందిని విధుల్లో నియమించామని, అదనంగా ఇతర జిల్లాలు, ప్రత్యేక విభాగాల నుంచి కూడా పోలీస్ సిబ్బందిని రప్పించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు సుమారు 1,200 మంది ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని, కీలక జంక్షన్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.నిమజ్జనాల కోసం కమిషనరేట్ పరిధిలో సుమారు 27 చెరువులు, బేబీ పాండ్లు, తాత్కాలిక ట్యాంకులను గుర్తించినట్లు సీపీ తెలిపారు. 2025లో సుమారు 25 వేల విగ్రహాలు నిమజ్జనం కాగా, ఈ ఏడాది కూడా దాదాపు అదే స్థాయిలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. నగర పరిధిలోకి వచ్చే నిమజ్జన ఊరేగింపులపై హైదరాబాద్ సిటీ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ 24 గంటల కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా సుమారు 5,000 సీసీ కెమెరాలు, ఏఐ ఆధారిత డ్రోన్ టెక్నాలజీని వినియోగించనున్నట్లు చెప్పారు. ఊరేగింపులు, ట్రాఫిక్ రద్దీ, సున్నిత ప్రాంతాలను డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడించారు."మీ సురక్ష-సహచరి" కార్యక్రమంలో భాగంగా 2,200 మంది సహచరి వాలంటీర్లు, 552 గణేష్ మండపాల వద్ద పోలీసులతో కలిసి ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు సీపీ తెలిపారు.గణేష్ మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్, శబ్ద కాలుష్య నిబంధనలను నిర్వాహకులు పాటించాలని సూచించారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని సీపీ సుమతి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## మనీ మ్యూల్ ఖాతాలకు
# కొత్త నిబంధనలు

హైదరాబాద్: సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, అక్రమ లావాదేవీలకు ఉపయోగించే మనీ మ్యూల్ ఖాతాల నియంత్రణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలను సిద్ధం చేసింది. సైబర్ నేరాల ద్వారా వచ్చిన సొమ్మును బదిలీ చేసేందుకు వాడే అనుమానాస్పద ఖాతాలపై బ్యాంకులు విధించే తాత్కాలిక డెబిట్ హోల్డ్‌కు గరిష్ఠంగా 60 రోజుల గడువును ప్రతిపాదించింది. బ్యాంకులు, ప్రజల నుంచి అక్టోబరు 2 వరకూ సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానించింది. వీటన్నింటి పరిశీలన అనంతరం తుది మార్గదర్శకాలను 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తారు. కావాలనుకుంటే బ్యాంకులు ముందుగానే అమలు చేయవచ్చు.

**రూ.1,000 దాటితే..**

కృత్రిమ మేధ (ఏఐ) ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎమ్‌ఎల్) సాంకేతికతల ద్వారా అనుమానాస్పద నగదు బదిలీలను బ్యాంకులు గుర్తిస్తాయి. రూ.1,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో ఉన్న సందేహాస్పద బదిలీలను గుర్తించిన వెంటనే బ్యాంకులు తాత్కాలికంగా డెబిట్ హోల్డ్ విధించవచ్చు. ఖాతాదారు సాధారణ లావాదేవీలకు భిన్నంగా ఉండటం, ఖాతాలో పెద్ద మొత్తంలో నిధులు జమ కావడం, ఇప్పటికే సైబర్ నేరాల జాబితాలో ఉన్న ఖాతాలతో సంబంధం ఉండటం ఆధారంగా వీటిని గుర్తిస్తారు. అనుమానం ఉన్న మొత్తానికే హోల్డ్‌ను పరిమితం చేయడం సాధ్యమైనప్పుడు, ఖాతాను నిలిపివేయాల్సిన అవసరం ఉండదు. ఖాతా స్థాయిలో హోల్డ్ విధించడం చివరి ప్రత్యామ్నాయంగా, అదీ అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఉండాలని ముసాయిదా స్పష్టంగా పేర్కొంది.




**20 రోజుల గడువు**

డెబిట్ హోల్డ్ విధించిన వెంటనే బ్యాంకు ఖాతాదారుడికి కారణాలు, తొలగించుకునే విధానం, సంప్రదించాల్సిన అధికారి వివరాలను తెలియజేయాలి. లావాదేవీ లేదా ఖాతా నిజమైనదేనని వివరించేందుకు ఖాతాదారుడికి 20 రోజుల సమయం ఇవ్వాలి. వివరణ అందిన తర్వాత బ్యాంకు దాన్ని పరిశీలించి, 10 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలి. వివరణ రాకపోతే హోల్డ్ విధించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా బ్యాంకు నిర్ణయం తీసుకోవాలి. ఖాతాదారుడు ఇచ్చిన వివరణ సంతృప్తిగా ఉంటే బ్యాంకు హోల్డ్‌ను వెంటనే తీసేయాలి. వివరణలో అనుమానాలుంటే, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ ద్వారా పోలీసులకు తెలియజేయాలి. విచారణ అధికారి నుంచి హోల్డ్‌ను కొనసాగించాలని ఆదేశాలు వస్తే, వెంటనే బ్యాంకులు వాటిని అమలు చేయాలి. కేసును పోలీసులకు పంపిన తేదీ నుంచి 30 రోజుల్లోగా హోల్డ్ కొనసాగించాలనే ఆదేశాలు రాకపోతే, 31వ రోజున హోల్డ్‌ను తీసేయాలి. పోలీసులు, లేదా విచారణ అధికారుల నుంచి ఆదేశాలు లేని పరిస్థితుల్లో తాత్కాలిక డెబిట్ హోల్డ్ గరిష్ఠంగా 60 రోజులు మాత్రమే ఉండాలి. ఇందులో మొదటి దశలో బ్యాంకు పరిశీలన, ఖాతాదారుడు వివరణ ఇచ్చే సమయం కలిసి 30 రోజులు, ఆ తర్వాత దర్యాప్తు సంస్థ నుంచి వచ్చే ఆదేశాల కోసం మరో 30 రోజులు కలిసి ఉంటాయి.

# ఏఐ స్పీడుకు కళ్లెం వేయాల్సిన టైమొచ్చింది: టెక్ దిగ్గజాలు

కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రానున్న పదేళ్లలో 10 శాతానికి పైగా మనుషులు ఏఐ కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఆంత్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ సైతం కృత్రిమ మేధతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఈ సాంకేతిక వేగానికి ఇకనైనా కళ్లెం వేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏఐ సామర్థ్యాల పెంపును తగ్గించాలని కంపెనీలను కోరారు. ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్, ఎక్స్‌ఏఐ అధిపతి ఎలాన్‌మస్క్ సైతం డారియో అభిప్రాయానికి మద్దతు పలికారు. స్వయంగా తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకునే సూపర్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రూపొందిస్తుండడంతో.. తమను తాము మెరుగుపరుచుకునే సామర్థ్యం AI వ్యవస్థల్లో పెరుగుతోందని డారియో ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ మేధకు చెందిన ఏజెంట్లు బాహ్య వ్యవస్థలను యాక్సెస్



చేయడానికి ప్రయత్నిస్తున్న విషయాలను గుర్తు చేశారు. ఏఐని ఇలాగే వదిలేస్తే అది త్వరలోనే స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను సృష్టిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 612 నెలల్లో ఆ సమూహం మొత్తం ఇంటర్నెట్‌ను స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే జరిగితే కొన్ని వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అయితే, తాను సాంకేతిక పురోగతిని పూర్తిగా నిలిపివేయాలని చెప్పట్లేదన్నారు. దానికి బదులుగా, కంపెనీలు తమ మోడళ్ల భద్రతను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి ఏఐ కంపెనీలకు మరింత సమయం అవసరమని డారియో పేర్కొన్నారు. కృత్రిమ మేధ (AI) వేగానికి బ్రేకులు వేయడానికి మూడుదశల ప్రణాళికను వివరించారు. ఇరాన్‌కు మద్దతిస్తోన్న యెమెన్‌లోని హూతీలు క్షిపణులను అభివృద్ధి చేయడానికి తమ ఏఐ చాట్‌బాట్ క్లాడ్‌ను ఉపయోగిస్తున్నట్లు ఆంత్రోపిక్ ఇటీవల తమ నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో డారియో తాజా హెచ్చరికలు చేయడం గమనార్హం.

**డారియో సూచించిన పరిష్కారాలు..**

* ఏఐ వినియోగంలో భద్రతను ధ్రువీకరించడానికి.. కంపెనీలలో నిరంతరం పర్యవేక్షించే స్వతంత్ర భద్రతా నిపుణుల నియామకం.
* భద్రతా ప్రమాణాలను నెలకొల్పడానికి, అనియంత్రిత అభివృద్ధిని నిరోధించడానికి అగ్రగామి ఏఐ సంస్థల మధ్య సమన్వయం.
* శక్తిమంతమవుతున్న ఏఐ వ్యవస్థల వల్ల కలిగే ప్రమాదాలను గుర్తించి, ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాల మధ్య సహకారం.

# ఆకాశానికి విమాన ఛార్జీలు

ఇప్పట్లో విమాన ఛార్జీలు తగ్గేలా కనిపించడం లేదు. ఓ పక్క దేశీయ ప్రయాణికుల రద్దీ తగ్గుతున్నా, విమానయాన సంస్థలు మాత్రం ఛార్జీలను తగ్గించక పోగా, పెంచుతున్నాయి. గిరాకీ ఎంత వేగంగా తగ్గుతోందో, అంతకంటే ఎక్కువ వేగంగా సర్వీసులను తగ్గించుకుంటున్నాయి. దీంతో ఛార్జీలను తగ్గించాల్సిన అవసరం లేకుండా చేసుకుంటున్నాయి.

**సర్వీసులు 38% దాకా తగ్గాయ్**

దేశీయ ప్రయాణికుల రద్దీ జనవరి జులైలో అంతక్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 0.64 శాతం పెరిగింది. అయిదేళ్లలోనే ఇది అతి తక్కువ వృద్ధి. జులైలో రద్దీ 5% మేర తగ్గింది. అయితే విమానయాన సంస్థలు ఇంత కంటే వేగంగా తమ సర్వీసులను తగ్గించాయి. జులైనే తీసుకుంటే స్పైస్‌జెట్ 38% మేర తన సర్వీసుల్లో కోత వేసింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్, ఇండిగో కూడా 319% మేర కోత వేశాయి. సర్వీసులు తగ్గితే, సహజంగా తక్కువ సీట్లు అందుబాటులో ఉంటాయి. అప్పుడు గిరాకీ తగ్గినా, ఛార్జీల ధరలు పెరుగుతాయన్నమాట. గత కొద్ది నెలలుగా 15 రోజుల ముందు బుకింగ్ ధోరణి చూస్తే టికెట్ ధరలు కనీసం 35 శాతం అధికంగానే ఉండడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**విమాన ఇంధన ధర ప్రియం కావడమూ..**



రద్దీ తగ్గడం, సర్వీసుల కోత విషయాన్ని పక్కనపెడితే విమానయాన సంస్థలకు పెరిగిన ముడి చమురు ధరల రూపంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విమానయాన సంస్థల ఖర్చుల్లో ఎక్కువ భాగం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)కే వెళ్తోంది. ఇక పాకిస్థాన్ గగనతలంపై ఆంక్షలు, పశ్చిమాసియా సెగలు చల్లారకపోవడం వల్ల ఆ ప్రాంతాలపై వెళ్లలేక, విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో అదనపు ఇంధనం కావాల్సి వస్తోంది. ఇదీ సర్వీసుల్లో కోతకు కారణంగా మారింది. 2024 జులైతో పోలిస్తే ఈ ఏడాది జులైలో ఏకంగా 10,000 వరకు సర్వీసులు తగ్గాయి. 2022 జులైలో కరోనా కారణంగా డిపార్చర్లు 75,875కు పరిమితం కాగా, ఆ తర్వాత పుంజుకున్నాయి. ఇప్పుడు మళ్లీ తగ్గుతున్నాయి.

**అయినా ఖాళీగా ఏం వెళ్లట్లేదు**

గడ్డు పరిస్థితుల్లో విమానయాన సంస్థలు చేపట్టిన ఈ చర్యల వల్ల ప్రయాణికుల సీట్ల భర్తీ (పీఎల్ఎఫ్) బాగుంది. ఈ ఏడాది జులైలో ప్రతీ 100 సీట్లకు 85.3 సీట్లు భర్తీ అయ్యాయి. వర్షాకాలం అయినా ఈ స్థాయిలో భర్తీ కావడానికి సర్వీసులు తగ్గడం కారణం. ఏప్రిల్‌జూన్‌లో విమాన టికెట్ల వ్యాపారం వృద్ధి చెందిందని ప్రయాణ బుకింగ్ వ్యాపార సంస్థలు చెబుతున్నాయంటే అందుకు వెనక కారణం అదే. మొత్తం మీద గిరాకీపైనే కాకుండా, విమానయాన సంస్థలు ఎన్ని సీట్లు మార్కెట్లో అందుబాటులోకి తీసుకొస్తున్నాయన్న దానిపై ఛార్జీలు ఆధారపడతాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో విమానయాన కంపెనీలు ఛార్జీల తగ్గింపు దిశగా ఆలోచించకపోవచ్చు.

# 'ఆదర్శ క్రికెటర్'.. ఈ మిస్టర్ డిపెండబుల్

రాహుల్ ద్రవిడ్ జీవితం నేటి తరం కుర్రాళ్లకో పెద్ద పాఠం. ఇదేదో కేవలం అతడి ఆటను ఉద్దేశించి మాత్రమే కాదండోయ్.. జట్టుకు ఎప్పుడు, ఎక్కడ అవసరమైతే అక్కడ ముందుండేవాడు. అందుకే అతడు 'ది వాల్'గా మారాడు. మిస్టర్ డిపెండబుల్‌గా అందరితో పిలిపించుకొంటూ ఇప్పుడు ఓనర్‌గానూ మారిపోయాడు.

**ఎన్ని పాత్రలు పోషించాడో..**

1996లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన ద్రవిడ్ తొలుత ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ తర్వాత ఒక్కొక్క అడుగు ముందుకేస్తూ మిడిలార్డర్‌కు చేరాడు. కొన్నాళ్లకు వన్‌డౌన్‌లో కీలక ఆటగాడిగా మారిపోయాడు. సచిన్, గంగూలీ, లక్ష్మణ్‌తో కలిసి భారత జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. టెస్టుల్లో గంటలతరబడి క్రీజ్‌లో పాతుకుపోయి ది వాల్‌గా అవతరించాడు. ప్రత్యర్థుల బౌలింగ్‌ను తట్టుకొని మిస్టర్ డిపెండబుల్‌గా నిలిచాడు. మరి బ్యాటింగ్‌కే అతడిపై ఇన్ని ప్రశంసలా? అని అనిపించకమానదు. కానీ, జట్టు కోసం ద్రవిడ్ చేసిన త్యాగాలు తక్కువేం కాదు.

**ఆ గడ్డుకాలంలోనూ..**

ఇప్పుడంటే నాణ్యమైన వికెట్లు కీపర్లు మనకు బోలెడు మంది. దినేశ్ కార్తిక్, ధోని రాక ముందు వరకూ దాదాపు ఆరేడేళ్లపాటు వికెట్ కీపర్ల విషయంలో మనకు గడ్డుకాలమే. ఎప్పుడైతే ధోని అడుగు పెట్టాడో దాదాపు దశాబ్దన్నరపాటు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. కానీ, 1999 నుంచి 2004 వరకూ సరైన బ్యాటింగ్ కమ్ వికెట్ కీపింగ్ ప్లేయర్ లేడంటే నమ్మగలమా? నయాన్ మోంగియా ఉన్నా అతడు వికెట్ కీపింగ్‌లో ఫర్వాలేదు కానీ.. గొప్ప బ్యాటర్‌గా మాత్రం కాలేకపోయాడు. అప్పటికే ఆసీస్‌కు ఆడమ్ గిల్‌క్రిస్ట్, దక్షిణాఫ్రికాకు మార్క్ బౌచర్, శ్రీలంక తరఫున కుమార్ సంగక్కర వంటి అద్భుతమైన స్కిల్డ్ బ్యాటింగ్ కమ్ వికెట్ కీపర్లు ఉండేవారు. దీంతో నాటి పరిస్థితులను బట్టి భారత్ తన తుది జట్టులో అదనంగా బ్యాటర్‌ను తీసుకోవాలంటే ఎవరైనా బౌలర్‌పై వేటు వేయాల్సిన పరిస్థితి. అందుకోసం అప్పుడున్న ఆటగాళ్లలోనే ఒకరికి వికెట్ కీపింగ్ బాధ్యతలు ఇచ్చి.. అదనంగా స్పెషలిస్ట్ బ్యాటర్‌ను తీసుకొనేందుకు మేనేజ్‌మెంట్ ఆలోచనలు చేసింది. 'నేనున్నానంటూ' ద్రవిడ్ ముందుకొచ్చాడు. అప్పటికి అతడేమీ అంతర్జాతీయంగా రెగ్యులర్ వికెట్ కీపర్ కాదు. అయినా సరే జట్టు కోసం కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇలా సుమారుగా 70కిపైగా వన్డేల్లో




కీపింగ్ బాధ్యతలను నిర్వర్తించాడు. 2003 వన్డే ప్రపంచ కప్‌లోనూ పలు మ్యాచులకు కీపింగ్ చేశాడు.

**కోచ్ నుంచి ఓనర్ వరకూ..**

క్రికెటర్‌గా కెరీర్‌ను ముగించిన రాహుల్ ద్రవిడ్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గానూ పనిచేశాడు. అంతకుముందు టీమ్ఇండియా A టీమ్‌కూ శిక్షణ బాధ్యతలు నిర్వర్తించాడు. ఇక ఐపీఎల్‌లోనూ మెంటార్, కోచ్‌గా మారాడు. ఇటీవల ఓ లీగ్‌లో టీ20 జట్టుకు సహాయజమాని కావడం గమనార్హం. యూరోపియన్ లీగ్‌లో ఓ జట్టు కొనుగోలులో అతడు భాగస్వామి.




## క్షమించేస్తా.. ప్రతీకారం
# తీర్చుకొనే వ్యక్తిని కాదు: స్మృతి మంధాన

ప్రస్తుత భారత మహిళా క్రికెట్‌లో స్మృతి మంధాన సూపర్ స్టార్. ఇటీవలే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గానూ ఘనత సాధించింది. ప్రస్తుతం ఆసియా కప్ ఫైనల్ కోసం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మంధాన ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొంది. సదరు వ్యాఖ్యాత రాజ్ షమాని అడిగిన ప్రశ్నకు మంధాన కాస్త భావోద్వేగానికి గురైంది. తాను కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతానని మంధాన వ్యాఖ్యానించిన వీడియో వైరల్‌గా మారింది.

* **షమాని: మీ జీవితంలో ఇప్పటి వరకు ఎదుర్కొన్న అత్యంత కఠినమైన రాత్రి ఏది?**

కాసేపు ఆలోచించిన మంధాన స్పందిస్తూ.. ''వరల్డ్ కప్ గురించి అనుకుంటా' అని వ్యాఖ్యానించింది. ఆ వెంటనే భావోద్వేగానికి గురైంది. ''నేను కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడతా'' అని చెప్పిన ఆమె కొవిడ్ సమయం కూడా అత్యంత కఠినమైందిగా పేర్కొంది. గతంలో పలాశ్ ముచ్చల్‌తో పెళ్లి వరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. అర్ధంతరంగా రద్దు కావడంతో కొన్నాళ్లు ఆమె మానసికంగానూ ఇబ్బంది పడింది. ఇప్పుడు ఆ ఘటనను గుర్తుకొచ్చి ఉంటుందని పలువురు కామెంట్ చేస్తున్నారు.

**క్షమిస్తా కానీ.. మరిచిపోను**




తన క్యారెక్టర్‌పై మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ''ఎవరూ నాకు అంత దగ్గరగా అనిపించరు. కానీ, నాకు చాలా కోపం వస్తుంది. అందుకే నాతో పెట్టుకోవద్దు అనే ధోరణితో ఉండేదాన్ని. నేను మీ దారికి అడ్డురానంత వరకూ.. నా దారికి అడ్డు రావద్దని కోరుకుంటా. నేనేమీ ప్రతీకారం తీర్చుకొనే వ్యక్తిని కాదు. అలాగని వెంటనే మరిచిపోను. ఎవరికీ చెడు మాత్రం చేయను. మనుషులను క్షమిస్తా కానీ... ఆ ఘటనను మరిచిపోను'' అని మంధాన తెలిపింది.

# మీ దౌత్యం అపూర్వం.. ప్రధాని మోదీజీ మీకు నమస్సులు: రవిశాస్త్రి

భారత ప్రధాని నరేంద్ర మోదీ (PM Modi In Brics) బ్రిక్స్ సదస్సులో బిజీగా ఉన్నారు. రష్యా, చైనా వంటి దేశాధినేతలతో చర్చలు జరిపారు. దిల్లీ వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ సదస్సులో మోదీ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో భారత ప్రధాని మోదీపై మాజీ క్రికెటర్ రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించారు. అద్భుతమైన నాయకత్వంలో శిఖరాగ్ర సమావేశాలు జరుగుతున్నాయని కొనియాడారు. ''ఓ భారతీయుడిగా ఇంతకంటే గర్వకారణం ఏముంటుంది. ప్రెసిడెంట్ పుతిన్, ప్రెసిడెంట్ జిన్‌పింగ్‌తోపాటు మన అద్భుత




ప్రధాని నరేంద్ర మోదీని భారత మండపంలో చూడటం అనిర్వచనీయం. ఇలాంటి అపూర్వమైన అంతర్జాతీయ దౌత్యం ఇంతకుముందెన్నడూ చూడలేదు. మీకు హృదయపూర్వక నమస్సులు

# టెస్టు క్రికెట్‌కు పాక్ అపకారం చేస్తోంది.. దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు

పాకిస్థాన్ క్రికెట్‌లో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై భారత మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్టుల్లో గొప్ప చరిత్ర కలిగిన పాక్.. ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా టెస్టు దేశాలతో పోటీపడే స్థితిలో లేదని వ్యాఖ్యానించాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో దినేశ్ కార్తిక్ ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు. ''నేను ఇంగ్లాండ్ vs పాకిస్థాన్ (ENG vs PAK) టెస్ట్ సిరీస్‌కు వ్యాఖ్యానం చేసినప్పుడు ఈ పాక్ జట్టు చాలా సాధారణంగా అనిపించింది. మొదటి రెండు టెస్టుల్లో వారు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేదు. పిచ్‌లు చాలా కఠినంగా ఉన్నాయి. కానీ, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేనంత క్లిష్టమైన పిచ్‌లు కావవి. పాకిస్థాన్ జట్టు టెస్ట్ క్రికెట్‌కు అపకారం చేస్తోందని నాజర్ హుస్సేన్ (ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్) అన్నాడు. నేను అతనితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. చివరి టెస్టులో రజావుల్లా బాగా రాణించాడు. అతను ఆరంభం నుంచే జట్టులో ఎందుకు లేడు? అసలు ఎంపిక ప్రక్రియలో ఏం జరుగుతోంది? ఎలాంటి ఆటగాళ్లను తీసుకుంటున్నారు? కెప్టెన్సీ మార్పులు, కోచ్‌ల మార్పులు అన్నీ అస్థిరంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రభావం వారి ఆటతీరులో స్పష్టంగా కనిపిస్తోంది.



ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వారు (Pakistan) ఆశించిన స్థాయిలో ఆడలేదు.

# ప్రధాని మోదీని కలిసిన స్కూల్ ఫ్రెండ్..

ప్రధాని నరేంద్ర మోదీని ఆయన చిన్ననాటి స్నేహితుడు (PM Modi schoolmate) అస్గర్‌అలీ వోహ్రా ఇటీవల కలిశారు. భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధించిన బిల్డర్లు నకిలీ పత్రాలను ఉపయోగించి తన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని ఆయన మోదీతో చెప్పుకొని వాపోయారు. ఎన్నో దశాబ్దాలుగా తన భూమి కోసం పోరాటం చేస్తున్నా.. న్యాయం జరగకపోవడంతో ప్రధానిని ఆశ్రయించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వోహ్రా గుజరాత్‌లోని వడ్నగర్‌లోని బీఎన్ హైస్కూల్ (BN School)లో చదువుకునే సమయంలోనే మోదీ కూడా అదే పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని భయందర్ ఈస్ట్‌లోని నవ్‌ఘర్ రోడ్డులో ఉన్న సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని 1989లో వోహ్రా కొనుగోలు చేశారు. 2011లో కొందరు బిల్డర్లు నకిలీ పత్రాలు తయారు చేసి, తన భూమిని రెండు భాగాలుగా విభజించారు. అందులో ఒక భాగాన్ని బిల్డర్స్ తమ పేరు మీద బదిలీ చేయించుకోగా.. మరో భాగాన్ని సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పేరుకు చెందినదిగా నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ సంస్థకు భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాతో సంబంధం ఉంది. దీంతో ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం



ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 2015లో ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా దాదాపు 11ఏళ్ల తర్వాత తాజాగా (2026) లో ఈ కేసులో కోర్టుకు నివేదిక సమర్పించిందని అన్నారు. తీరా చూస్తే.. 2025లో నిందితులు తనపై ఎదురు కేసు పెట్టినట్లు తెలిసిందని వాపోయారు. దీంతో మరోదారి లేక తన చిన్ననాటి స్నేహితుడైన మోదీతో తన బాధను తెలియజేయడానికి ప్రధాని నివాసానికి వచ్చినట్లు తెలిపారు. రాజకీయ నేతల బెదిరింపుల వల్లే అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకోవట్లేదని.. దీనిపై సీబీఐతో విచారణ జరిపించి, తనకు న్యాయం చేయాలని వోహ్రా మోదీని కోరారు. మోదీ ఆయనకు న్యాయం జరుగుతుందని ధైర్యం చెప్పారు. ఈ నేపథ్యంలో వోహ్రాకు సంబంధించిన భూవివాదంపై ఈనెల 16న కోర్టులో విచారణ జరగనుందని అధికారులు వెల్లడించారు.

# జెలెన్‌స్కీతో పుతిన్ చర్చలు అసాధ్యం: క్రెమ్లిన్





రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో మియామిలో జరగనున్న జీ20 సదస్సు లో జెలెన్‌స్కీ పుతిన్ నేరుగా చర్చ ల్లో పాల్గొననున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనిపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ.. అవన్నీ తప్పుడు వార్తలని కొట్టిపడేశారు. ఇరువురి మధ్య ప్రత్యక్ష చర్చలు జరగడం అసాధ్యమని పేర్కొన్నారు. ఒకవేళ జెలెన్‌స్కీ.. పుతిన్‌ను నేరుగా కలవాలంటే మాస్కోకు రావాలని పునరుద్ఘాటించారు. తమ దేశంలో కాకుండా మరే ప్రదేశంలోనూ చర్చలు నిర్వహించడానికి తాము అంగీకరించబోమన్నారు. అమెరికా వేదికగా డిసెంబర్‌లో జరగనున్న జీ20 శిఖరాగ్ర సమావేశానికి పుతిన్ హాజరవుతారా లేదా అనే విషయంపైనా ఎటువంటి అధికారిక సమాచారం లేదు. ఈ విషయంపై శనివారం జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. జీ20 సమయంలో అమెరికా తనను, పుతిన్‌ను ఆహ్వానిస్తే రష్యా అధ్యక్షుడితో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. యుద్ధం విషయంలో మాస్కో ఏమనుకుంటుందన్నదే ముఖ్యమన్నారు. అదే సమయంలో గతేడాదితో పోలిస్తే.. ప్రస్తుతం తాము మరింత బలంగా రష్యా సేనలను ఎదుర్కొంటున్నామన్నారు.

# సీఎం పదవికి రాజీనామా చేస్తున్నా: ప్రభుత్వంపై అభిజీత్ వ్యంగ్యాస్త్రాలు

మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం గిరిజన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి అవహేళనలు ఎదురయ్యాయి. ఆ ఘటనపై దీప్కే స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కొందరు వ్యక్తులు తనను ముఖ్యమంత్రిగా భావించి, విమర్శించారని అన్నారు. అందుకుగానూ పిల్లల మరణాలకు నైతిక బాధ్యత



వహిస్తూ.. మధ్యప్రదేశ్ సీఎంగా రాజీనామా చేస్తున్నా'నంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌లో పేర్కొన్నారు. 'నేను తక్షణమే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నా. రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీజీకి ధన్యవాదాలు. అయితే, ఆ బాధ్యతను నిర్వర్తించడంలో నేను పూర్తిగా విఫలమయ్యాను. బాలాఘాట్‌లో 30మందికి పైగా గిరిజన పిల్లల మరణాల తర్వాత, ఈ పదవిలో కొనసాగడానికి నా అంతరాత్మ అంగీకరించట్లేదు'' ''బాధిత కుటుంబాలకు రూ.2లక్షల నష్టపరిహారం ఇస్తామని మొదట ప్రకటించాం. పిల్లల మరణాలను ప్రశ్నిస్తూ.. గిరిజన వర్గాలు నిరసన చేపట్టడంతో ఆ పరిహారాన్ని రూ.4లక్షలకు పెంచాము. అదే చనిపోయిన పిల్లలు ఎమ్మెల్యేల పిల్లలై ఉంటే ఇంతే మొత్తాన్ని చెల్లించేవారిమా? చిన్నారుల మరణానికి కారణమైన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బాలాఘాట్ గిరిజనులకే కాకుండా రాష్ట్రంలోని గిరిజనులందరికీ నేను అన్యాయం చేశాను. అందువల్లే ఈ పదవిలో కొనసాగే నైతిక హక్కు నాకు ఉందని భావించట్లేదు' అని దీప్కే సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

# 2029 నాటికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి: షా

ఉమ్మడి పౌరస్మృతి అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 నాటికి భాజపా నేతృత్వంలోని ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముంబయిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత విషయాల్లో ఒకే రకమైన చట్టాన్ని వర్తింపజేసేందుకు ఉద్దేశించిన ఉమ్మడి పౌరస్మృతిని ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమల్లోకి తీసుకొచ్చామని అమిత్‌షా చెప్పారు. 2029 నాటికి 21 ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో అమల్లోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ భద్రత



విషయంలో రాజీ పడేది లేదని ఈ సందర్భంగా అమిత్‌షా పేర్కొన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదం పట్ల ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశామన్నారు. 2014కు ముందు అవినీతి, వారసత్వ రాజకీయ యుగం రాజ్యమేలాయన్నారు. భాజపా దాన్ని పూర్తిగా మార్చివేసి, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని గుర్తుచేశారు. ఐదు బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితా నుంచి దేశాన్ని ఐదు అగ్ర దేశాల జాబితాలోకి చేర్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలో నమోదైన 7.8% జీడీపీ వృద్ధిని ప్రస్తావించారు. దేశ అంతర్గత భద్రతకు సవాళ్లు విసురుతూ వస్తున్న ఆర్టికల్ 370, నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతి వంటి సమస్యలను తమ ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని తెలిపారు. ప్రజాసేవలో ప్రధాని మోదీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్'ను చేపట్టనున్నట్లు అమిత్ షా పేర్కొన్నారు.

# రూల్స్ లేని ప్రపంచం.. సిగ్నల్స్ లేని కూడలి లాంటిది: జిన్‌పింగ్

రూల్స్ లేని ప్రపంచం.. ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి లాంటిదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ (Xi Jinping) అన్నారు. అటువంటి పరిస్థితుల్లో గందరగోళం తప్పదని హెచ్చరించారు. దిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. సరఫరా గొలుసులను కాపాడి, సమీకృత మార్కెట్‌ను ప్రోత్సహించేందుకు గ్లోబల్ సౌత్ దేశాలతో తనకున్న సన్నిహిత సంబంధాలను బ్రిక్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాణిజ్యం, తయారీ రంగం, పెట్టుబడులు, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఐదు సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించారు. బలవంతుడిదే రాజ్యమనే భావనను వీడాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ ఐక్యతకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని లిఖించాలని బ్రిక్స్ దేశాధినేతలకు పిలుపునిచ్చారు. పరిమాణం, శక్తిసామర్థ్యాలు, సంపదతో సంబంధం లేకుండా ప్రపంచ వేదికపై అన్ని దేశాలు సమానమేనని, అంతర్జాతీయ నియమాలను అవన్నీ కలిసి రూపొందించాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలు అందరికీ వర్తించేలా గ్లోబల్ సౌత్ దేశాలు కృషి చేయాలని చెప్పారు. ప్రపంచ వ్యవహారాల్లో ఐరాస అధికారాన్ని, పాత్రను సమర్థించాలని, అన్ని దేశాలకూ సమాన భాగస్వామ్యం ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# నా తప్పునకు మూల్యం చెల్లించుకుంటున్నా: నితిన్ గడ్కరీ

ముంబయి రోడ్ల పరిస్థితి, ట్రాఫిక్ కష్టాలపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయిలో ఇండోఅమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (IACC) శనివారం నిర్వహించిన 22వ ఇండోఅమెరికన్ కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో గడ్కరీ పాల్గొన్నారు. సమావేశానికి గంట ఆలస్యంగా వచ్చినందుకు అక్కడి వారికి క్షమాపణలు చెప్పారు. తాము ముందుగానే బయల్దేరినప్పటికీ.. ట్రాఫిక్ సమస్యల వల్ల ఆలస్యమయ్యిందన్నారు. తన తప్పునకు మూల్యం చెల్లించుకుంటున్నానని పేర్కొనడంతో కార్యక్రమంలో నవ్వులు విరిశాయి. 'ఈ కార్యక్రమానికి గంట ఆలస్యంగా వచ్చాను. ఎందుకంటే నేను వర్లీ ప్రాంతం నుంచి ఈ హోటల్‌కు వచ్చేటప్పుడు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాను. నిజానికి నేను చేసిన తప్పునకు మూల్యం చెల్లిస్తున్నాను. ఎందుకంటే 19952000 మధ్య నేను మహారాష్ట్ర మంత్రిగా పనిచేసినప్పుడు 55 ఫ్లైఓవర్లు, బాంద్రా వర్లీ సీ లింక్, ముంబయిపుణె ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మించే అవకాశం వచ్చింది. కానీ, ఆ సమయంలో సరైన సాంకేతికత అందుబాటులో లేనందున వాటిని చేపట్టలేకపోయాం. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగేకొద్దీ.. దశాబ్దాల క్రితం రూపొందించిన మౌలిక సదుపాయాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి' అని గడ్కరీ పేర్కొన్నారు. భారత్ అమెరికా మధ్య కుదిరిన సాంకేతిక సహకారంతో దేశం ఎదుర్కొంటున్న అనేక అభివృద్ధి సవాళ్లు పరిష్కారమవుతాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, పాత ఫ్లైఓవర్లు మార్చడం, అధునాతన నిర్మాణ సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం కేవలం సంప్రదాయ డిజైన్లపైనే ఆధారపడకుండా.. కొత్త సాంకేతికత ఆధారిత నిర్మాణాలతో భర్తీ చేయాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సలహా ఇచ్చినట్లు తెలిపారు.

**భారత్ సామర్థ్యాలు.. అమెరికా వనరులు**

పుణెలో రూ.50వేల కోట్ల విలువైన ప్రతిపాదిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టును ప్రస్తావిస్తూ..



ఒకే సెట్ పిల్లర్లపై అనేక స్థాయిల ఫ్లైఓవర్లను నిర్మించడానికి మలేషియా సాంకేతికతను అవలంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సాంకేతికతతో అదే ఫ్లైఓవర్‌పై మెట్రో కారిడార్ సైతం ఏర్పాటు చేయడానికి వీలుంటుందన్నారు. ఇటువంటి బహుళస్థాయి మౌలిక సదుపాయాలు నగరాల్లో పెరుగుతున్న రద్దీ, రవాణా అవసరాలకు మెరుగైన పరిష్కారాన్ని అందించగలవన్నారు. భారత్ సామర్థ్యాలను అమెరికా వనరులు, సాంకేతిక నైపుణ్యంతో మేళవించి దేశంలోని వివిధ రంగాలను మరింత అభివృద్ధి చేయొచ్చన్నారు.

# ప్రభుత్వ ఇళ్ల కోసం దళారులను నమ్మి డబ్బులివ్వొద్దు: పి.వి. గౌతం

హైదరాబాద్: ఇందిరమ్మ ఎల్‌ఐజీ ఇళ్ల లబ్ధిదారులకు ఈ వారంలో మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ పి.వి.గౌతం తెలిపారు. లాటరీలో ఎంపికైన 7,340 మందిలో 6,643 మంది క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని, ఇప్పటివరకు 5,521 మంది అర్హులుగా నిర్ధరణ అయినట్లు చెప్పారు. క్యూర్ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మధ్యవర్తుల ప్రమేయం ఉండబోదని, ప్రభుత్వ ఇళ్ల కోసం దళారులను నమ్మి డబ్బులు ఇవ్వొద్దని ఆయన కోరారు.



# AI గురించి వాళ్లే భయపెడుతున్నారు – ట్రంప్

కృత్రిమ మేధ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని, దానిపై కఠినమైన నియంత్రణలు విధించాలని వస్తోన్న వాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. ప్రతికూల శక్తులే ఈ సాంకేతికతపై భయాలను పెంచుతున్నాయని అన్నారు. జరగని విషయాలనే వాళ్లు లేవనెత్తుతున్నారని, వారి ఆందోళనలు అతిశయంగా ఉన్నాయని చెప్పారు. చైనాపై అమెరికా ఆధిక్యాన్ని కొనసాగించాల్సిన అవసరముందని ట్రంప్ స్పష్టం చేశారు. ''కృత్రిమ మేధలో చైనాను అధిగమిస్తున్నాం. ప్రపంచంలోనే మనది అత్యంత అధునాతన దేశం. దానిని అలాగే



కొనసాగించాలని అనుకుంటున్నా. ఎందుకంటే.. ఏఐలో ఎవరు గెలిస్తే వారిదే విజయం'' అని ట్రంప్ పేర్కొన్నారు. ఐర్లాండ్ పర్యటనకు వెళ్తున్న సమయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఏఐపై కఠిన నియంత్రణలు తీసుకురావడం అవసరమా? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. అయితే, రక్షణ చర్యలు మాత్రం చేపట్టవచ్చని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు: కొండా మురళి

వరంగల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని కొండా మురళి అన్నారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత తొలిసారిగా వరంగల్‌లో పార్టీ కార్యకర్తలతో కొండా దంపతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ... కొండా సురేఖను గెలిపించడంలో రాహుల్‌గాంధీ పాత్ర ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు. ''పదవులు ఇవాళ వస్తాయి.. రేపు పోతాయి. కానీ, మాట కోసం నిలబడతాం. కృతజ్ఞత అనేది మా రక్తం, మా కుటుంబంలో ఉంది. కొండా సురేఖను సారీ అని ఒక్క మాట చెప్పమన్నారు. పదవి ఉంటే ఉండనీ .. పోతే పోనీ అని నా భార్య సారీ చెప్పలేదు. ఎన్ని రోజులు బతికామన్నది కాదు.. ఎలా బతికామన్నది ముఖ్యం'' అని కొండా మురళి అన్నారు.



# నెతన్యాహు జుట్టు, మేకప్ కోసం.. ఏడేళ్లలో రూ.4 కోట్ల ఖర్చు!

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రులకు సంబంధించి ఓ ఆసక్తికర విషయం వెల్లడైంది. 2019 నుంచి ఇప్పటివరకు ఆ దేశ ప్రధానుల హెయిర్ స్టైలింగ్, మేకప్‌తోపాటు అధికారిక కార్యక్రమాల్లో హుందాగా కనిపించేందుకు అవసరమైన దుస్తులు, నిర్వహణ కోసం 4.70 లక్షల డాలర్లు ఖర్చయినట్లు తెలిసింది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం రూ.4.49 కోట్లు. ప్రధాన మంత్రుల వ్యక్తిగత ఖర్చుల సమాచారాన్ని తెలియజేయాలని కోరుతూ యారా వింక్లర్ షాలిట్ అనే న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం ఇటీవల సమాచారం వెల్లడించింది. అయితే, గత ఏడేళ్లలో వీటి కోసం పెట్టిన ఖర్చులో 90 శాతం నెతన్యాహు, ఆయన సతీమణి సారా కేశాలంకరణ, మేకప్‌ల కోసమే ఉండడం గమనార్హం. ఇజ్రాయెల్‌లో (Israel PM) 2019 నుంచి 2026 వరకు నెతన్యాహు, నఫ్తాలీ బెన్నెట్, యైర్ లాపిడ్‌లు ప్రధాన మంత్రులుగా ఉన్నారు. వీరిలో ప్రస్తుత పీఎం నెతన్యాహు ఎక్కువ కాలం ఆ పదవిలో కొనసాగుతున్నారు. వీరిలో 2022లో పీఎం పదవిలో ఉన్న నఫ్తాలీ, యైర్ మేకప్‌ల కోసం సుమారు రూ.26 లక్షలు ఖర్చు చేయగా.. 2023లో నెతన్యాహు కోసం ఏకంగా రూ.97లక్షలు చెల్లించినట్లు తెలిసింది. అంతేకాదు, జుట్టు, మేకప్‌లపై చేసే ఖర్చు ఏటా గణనీయంగా పెరిగిందని తాజా సమాచారం ద్వారా వెల్లడైంది. కేవలం ఒక్క ఏడాదిలోనే (2025లో) ప్రభుత్వం సుమారు రూ.1.06 కోట్లు ఖర్చు పెట్టినట్లు వెల్లడైంది.



**విదేశీ పర్యటనల వేళ..**

2023 అక్టోబర్‌లో గాజాపై యుద్ధం మొదలైన సమయంలోనూ జుట్టు, మేకప్ కోసం నెతన్యాహు రూ.1.5 లక్షలు ఖర్చు పెట్టినట్లు తేలింది. విదేశీ ప్రయాణాల సమయంలోనూ వీటి కోసం ఖర్చు పెట్టారట. గతేడాది ఫిబ్రవరిలో నాలుగురోజుల అమెరికాలో పర్యటించిన సమయంలో రూ.12.9లక్షలు, అంతకుముందు ఏడాది వాషింగ్టన్ వెళ్లినప్పుడు దాదాపు రూ.11 లక్షలు జుట్టు, మేకప్ కోసం ఖర్చు పెట్టారని వెల్లడైంది. నెతన్యాహు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేటప్పుడు దుస్తులు, ఇతర నిర్వహణ కోసం సుమారు రూ.1.28 కోట్ల ఖర్చు అయ్యిందని తెలిసింది.



# చాక్లెట్ తినాలనిపిస్తోందా?

## మీ శరీరం ఏం చెబుతుందో తెలుసా!

చాలా మంది ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కార్బోహైడ్రేట్ ఫుడ్ తీసుకోవడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా, చాక్లెట్స్, స్వీట్స్, కేక్స్, జ్యూసెస్, బేకరీ ప్రొడక్ట్స్ తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. అలాగే, బయట హోటల్‌కు వెళ్లి లార్జ్ మీల్స్ తినడం చేస్తుంటారు. వీటిలో శాచురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఒత్తిడి కారణంగా ఎక్కువ ఆహారం తీసుకోవడం వల్ల రకరకాల మెటబాలిక్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందట. ఒత్తిడి కారణంగా తింటుంటే, ఆ ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం, క్రమం తప్పని వ్యాయామం సహాయపడతాయని అంటున్నారు. కొన్ని అలవాట్ల వల్ల ఈ ఎమోషనల్ ఈటింగ్ చేస్తారట. ఎలాగంటే, రోజూ ఒక చాక్లెట్ తినే అలవాటు ఉండటం, ఎవరైనా తింటుంటే తినాలనిపించడం వంటివి ఎమోషనల్ ఈటింగ్‌ను ట్రిగ్గర్ చేస్తాయంటున్నారు నిపుణులు. బోర్ కొట్టినప్పుడు ఆకలి లేకున్నా తినడం కూడా ఎమోషనల్ ఈటింగ్ కిందకే వస్తుందని చెబుతున్నారు. ఆహారం విషయంలో ఇతరుల ప్రభావం పడి ఇలా తింటుంటారు. కొన్ని సార్లు ఏ పని లేక టైం పాస్ చేయడానికి ఏదో ఒకటి నోట్లో వేసుకుంటారు. ఇలాంటి పరిస్థితులు కూడా ఎమోషనల్ ఈటింగ్‌ను ట్రిగ్గర్ చేస్తాయట. భోజనాల మధ్యలో ఏదైనా తినాలనిపిస్తే, తాజా పండ్లు, నట్స్ లేదా వెన్న లేని పాప్‌కార్న్ వంటి ఆరోగ్యకరమైన చిరుతిండిని ఎంచుకోమని సూచిస్తున్నారు. ఎమోషనల్ ఈటింగ్ వల్ల శరీరానికి అదనపు క్యాలరీలు చేరి శరీరంలో ఫ్యాట్ పెరిగిపోతుంది. దీనివల్ల డయాబెటిస్, గుండె సమస్యలు వచ్చే రిస్క్ ఎక్కువని హెచ్చరిస్తున్నారు. ఎమోషనల్ ఈటింగ్‌ను తగ్గించుకోవడానికి ముందుగా భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలట. ఒత్తిడిగా ఉన్నప్పుడు ఎక్కువగా ఆహారం తీసుకోకుండా మ్యూజిక్ వినడం, ఫ్రెండ్స్‌తో మాట్లాడటం, వాకింగ్ వంటివి అలవాటు చేసుకోవాలి. దీని వల్ల ఒత్తిడి తగ్గి, ఎమోషనల్ ఈటింగ్ కంట్రోల్ అవుతుంది. అలాగే, తాజా పండ్లు, ఫైబర్ ఎక్కువ ఉండే కూరగాయలు, నట్స్, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్రీన్ టీ, సూప్స్ లాంటివి తీసుకోవాలట. మీ అవగాహన కోసం మేం ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. సందేహాలున్న వారు మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది. వైద్య చికిత్సకు ఇది ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదు.





# జిమ్ మంచిదా? యోగా బెటరా..?

## నిపుణులు ఏం చెబుతున్నారంటే!

ప్రస్తుత కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్ ప్రమాదాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గుండెను పదిలంగా ఉంచుకోవడానికి వ్యాయామం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, గుండె ఆరోగ్యానికి జిమ్‌కి వెళ్లి వర్కౌట్లు చేయడం మంచిదా లేక యోగా సాధన చేయడం ఉత్తమమా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణులైన కార్డియాలజిస్టుల ప్రకారం, ఈ రెండూ ఒకదానికొకటి పోటీ కావు..

ఒకదానికి ఒకటి తోడుగా పనిచేసే భాగస్వాములు. ఇంతకీ గుండె ఆరోగ్యానికి జిమ్ లేదా యోగా ఏది మంచిది..? నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్యకరమైన గుండెను కాపాడుకోవడానికి జిమ్, యోగా రెండూ అవసరమైనవే. అయితే, అవి పనిచేసే పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఒకదానిని మించి మరొకటి ఎంచుకోవడం కంటే, రెండింటినీ మీ ఫిట్‌నెస్ దినచర్యలో చేర్చుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

**వ్యాయామం చేయడం వల్ల గుండెకు కలిగే ప్రయోజనం ఏమిటి?:**

వేగంగా నడవడం, జాగింగ్, సైక్లింగ్, రోయింగ్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వంటి జిమ్ వ్యాయామాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. క్రమం తప్పని వ్యాయామం గుండెను బలపరుస్తుంది. శరీరమంతటా రక్తాన్ని ప్రసరింపజేయడంలో దాని సామర్థ్యాన్ని పెంచుతుంది. జిమ్ వర్కౌట్లు గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తాయి. అవి బరువును అదుపులో ఉంచడంలో కూడా సహాయపడతాయి. తద్వారా గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

అవి స్టామినా, ఓర్పును కూడా పెంచుతాయి. క్రమం తప్పని కార్డియో వ్యాయామాలు గుండెను బలపరుస్తాయని, శరీరమంతటా ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని పంప్ చేసే ప్రక్రియను సులభతరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**గుండెకు యోగా ఎందుకు ముఖ్యం?:**

యోగా శరీర సౌలభ్యాన్ని మెరుగుపరచడం, సరైన శ్వాస, సమతుల్యతను కాపాడుకోవడం, మానసిక ప్రశాంతతపై దృష్టి పెడుతుంది. కార్డియో వ్యాయామాల వలె యోగా ఏరోబిక్ ఫిట్‌నెస్‌ను అందించనప్పటికీ, ఇది గుండె ఆరోగ్యానికి అనేక ఇతర విధాలుగా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.

యోగా ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది శరీర సౌలభ్యాన్ని, భంగిమను మెరుగుపరుస్తుంది. శ్వాస సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. గుండె జబ్బులకు ఒత్తిడి ఒక ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. యోగా మనస్సును, నాడీ వ్యవస్థను ప్రశాంతపరచడం ద్వారా ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**కేవలం యోగా చేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉండగలదా?:**

యోగా వల్ల అనేక శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, గుండె సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరచడానికి అవసరమైన ఏరోబిక్ వ్యాయామాన్ని కేవలం యోగా మాత్రమే శరీరానికి అందించదని నిపుణులు అంటున్నారు. నిపుణుల ప్రకారం, ఆరోగ్యంగా ఉన్నవారు ప్రతి వారం కనీసం 150 నిమిషాల పాటు వేగంగా నడవడం, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి మధ్యస్థ తీవ్రత గల వ్యాయామం చేయాలి. మెరుగైన ఫిట్‌నెస్, గుండె ఆరోగ్యం కోసం యోగాను ఇతర శారీరక కార్యకలాపాలతో కలిపి చేయడం కూడా ముఖ్యం.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎలాంటి వ్యాయామం చేయాలి?:**

జిమ్, యోగాలో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన అవసరం లేదని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. మీ ఫిట్‌నెస్ దినచర్యలో రెండింటినీ చేర్చుకోవడం ఉత్తమం.

ఒక సమతుల్య ఫిట్‌నెస్ ప్రణాళికలో వేగంగా నడవడం, జాగింగ్, సైక్లింగ్ లేదా ఈత వంటి ఏరోబిక్ వ్యాయామాలు, వారానికి కనీసం రెండు రోజులు శక్తి శిక్షణ, కోలుకోవడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా ఉంటాయి. ప్రతిరోజూ సాగదీసే (స్ట్రెచింగ్), శ్వాస వ్యాయామాలను కూడా చేర్చుకోవాలి. ఈ దినచర్య గుండె ఆరోగ్యాన్ని, కండరాల సౌలభ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.



# జిమ్, డైటింగ్ అవసరం లేదు

**ఈ చిన్న మార్పులతో బరువు తగ్గడం చాలా ఈజీ..**

**బరువు తగ్గాలని జిమ్‌లలో చేరి అలసిపోతున్నారా? కడుపు మార్చుకుని డైటింగ్స్ చేస్తున్నా ఫలితం లేదా? అయితే అస్సలు టెన్షన్ వద్దు.. వెయిట్ లాస్ అవ్వడానికి కఠినమైన రూల్స్ అవసరం లేదంటున్నారు నిపుణులు. మన రోజువారీ అలవాట్లలో చేసుకునే 3 చిన్న మార్పులతో ఈజీగా స్లిమ్‌గా ఎలా మారచ్చో ఈ స్టోరీలో తెలుసుకుందాం..**

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య అధిక బరువు. బరువు తగ్గడం కోసం రాత్రి రాత్రికే కఠినమైన డైటింగ్స్ చేయడం, జిమ్‌లలో గంటల తరబడి చెమటలు చిందించడం చేస్తుంటారు. అయితే బరువు తగ్గడానికి కఠినమైన నియమాలు అవసరం లేదని.. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే ఇందుకు ఉత్తమ మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఒకే రోజులో మ్యాజిక్ జరగదు కాబట్టి లాంగ్ టర్మ్‌లో ఫిట్‌గా ఉండటానికి వైద్య నిపుణులు సూచిస్తున్న ఆ 3 సింపుల్ అండ్ పవర్‌ఫుల్ లైఫ్‌స్టైల్ మార్పులు ఏంటో తెలుసుకుందాం..

### రాత్రి పూట స్వీట్ క్రేవింగ్స్‌కు ఇలా చెక్ పెట్టండి

చాలా మందికి రాత్రి భోజనం చేసిన తర్వాత లేదా అర్ధరాత్రి పూట సడన్‌గా స్వీట్లు, చాక్లెట్లు లేదా కేకులు తినాలనే కోరిక కలుగుతుంది. బరువు పెరగడానికి ఇది ఒక ముఖ్య కారణం. ఈ అలవాటును అదుపు చేయడం చాలా మందికి ఒక పెద్ద సవాలు. అయితే ఇలాంటి సమయాల్లో అధిక క్యాలరీలు ఉండే చాక్లెట్లకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి సిద్ధమైన పండ్లను ఎంచుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఒక ఆపిల్ ముక్కపై కొద్దిగా నట్స్ బటర్ రాసుకుని తినడం వల్ల శరీరానికి ఎలాంటి హాని జరగదు. పైగా తక్కువ క్యాలరీలతోనే స్వీట్ తినాలనే కోరిక తీరుతుంది.

### డైట్ ప్లాన్ – క్యాలరీల లెక్క

ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ కోసం సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ వ్యాయామం సమపాళ్లలో ఉండాలి. ఇందుకోసం మీ రోజువారీ భోజనాన్ని ఇలా ప్లాన్ చేసుకోండి..

**ఉదయపు అల్పాహారం :** బ్రేక్‌ఫాస్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ స్కిప్ చేయకూడదు. ఇది పూర్తిగా, పోషకాలతో నిండి ఉండాలి.

**మధ్యాహ్న భోజనం :** లంచ్ ఎప్పుడూ మితంగా ఉండాలి.

**రాత్రి భోజనం:** డిన్నర్ చాలా తేలికగా, తక్కువ క్వాంటిటీలో ఉండాలి.

ముఖ్యంగా నూనెలో వేయించిన ఫ్రైలు, కొవ్వు పదార్థాలను పక్కన పెట్టి.. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్డు తెల్లసొన వంటి ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

### ఒకే రోజులో మార్పు రాదు.. కన్సిస్టెన్సీ ముఖ్యం

శరీరంలో మార్పులు అనేవి ఒకే రోజులో లేదా ఒకే రాత్రిలో జరిగిపోవు. అందుకే నెలకు 10 కిలోలు తగ్గాలి లాంటి భారీ లక్ష్యాలు పెట్టుకోకుండా.. వారంతపు ప్రాతిపదికన చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి. ఎప్పుడో ఒకసారి వ్యాయామం చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. నిరంతరాయంగా, ప్రతిరోజూ చేసే చిన్నపాటి వ్యాయామం మాత్రమే శరీరంలో మెటబాలిజం రేటును పెంచి, కొవ్వును వేగంగా కరిగిస్తుంది. అలసట పడకుండా ఈ సింపుల్ అలవాట్లను లైఫ్‌స్టైల్‌గా మార్చుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్యం మీ సొంతం అవుతుందని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

(గమనిక: ఇక్కడ ఇచ్చిన సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. దీనిని మేము నిర్ధారించడం లేదు. జీవన శైలి, ఆహార మార్పులు చేసుకునే ముందు నిపుణులను సంప్రదించడం మంచిది.)








# ఉత్తమ నటుడిగా తేజా సజ్జా

- సంక్రాంతికి వస్తున్నాం, కోర్ట్ మూవీలకు నాలుగు చొప్పున అవార్డులు
- బెంగళూరు వేదికగా అట్టహాసంగా సైమా అవార్డ్స్ వేడుక

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే సైమా అవార్డ్స్ వేడుక ఆద్యాంతం అట్టహాసంగా జరిగింది. బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలో తారలు తళుక్కుమన్నారు. తెలుగు, కన్నడ భాషల మూవీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అవార్డులను సొంతం చేసుకున్నారు. మిరాయ్ మూవీలో నటనకుగాను తేజా సజ్జా ఉత్తమ నటుడిగా, సంక్రాంతికి వస్తున్నాం మూవీలో నటనకు ఐశ్వర్య రాజేశ్ ఉత్తమ నటిగా ఎంపికై అవార్డులు దక్కించుకున్నారు. కాంతార చాప్టర్ 1 చిత్రంలో అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న కన్నడ హీరో రిషబ్‌శెట్టి ఉత్తమ నటుడిగా నిలిచారు. మొత్తంగా మిరాయ్ సినిమాకు రెండు అవార్డులు రాగా, సంక్రాంతికి వస్తున్నాం, కోర్ట్ సినిమాలకు నాలుగు చొప్పున అవార్డులు దక్కాయి. ఇక బుల్లిరాజు అలియాస్ భీమల రేవంత్ బెస్ట్ కమెడియన్‌గా నిలిచారు.





- వీరే అవార్డుల విజేతలు..

ఉత్తమ నటుడు - తేజ సజ్జా (మిరాయ్)
ఉత్తమ నటి - ఐశ్వర్య రాజేశ్ (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ సహాయనటుడు- సత్యదేవ్ (కింగ్డమ్)
ఉత్తమ సహాయ నటి- శ్రద్ధా శ్రీనాథ్ (డాకు మహరాజ్)
ఉత్తమ హాస్య నటుడు - బుల్లిరాజు (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ సినిమాటోగ్రఫీ- కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ నేపథ్య గాయకుడు - రమణ గోగుల (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ నేపథ్య గాయని - సమీరా భరద్వాజ్ (కోర్టు)
ఉత్తమ నటుడు (పరిచయ)- హర్ష్ రోషన్ (కోర్ట్)
ఉత్తమ నటి (పరిచయ)- శ్రీదేవి (కోర్ట్)
ఉత్తమ నటి (పరిచయ)- సాక్షి మదోల్కర్ (మోగ్లీ)
ఉత్తమ గేయ రచయిత- పూర్ణా చారి (కోర్ట్)

# ఇరుముడి టీమ్‌పై ప్రశంసలు

రవితేజ హీరోగా నటించిన ఇరుముడి మూవీపై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు కురించారు. రవితేజతో పాటు దర్శకుడు శివ నిర్వాణ, మైత్రీ మూవీ అధినేతలు రవి శంకర్, నవీన్ చిరంజీవి నివాసంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని చిరంజీవి సత్కరించారు. ఈ సన్మాన వేడుకలో రామ్‌చరణ్ కూడా పాలు పంచుకున్నాడు. కాగా ఈ మూవీకి నిర్మాతలు పెట్టిన బడ్జెట్ కంటే ఐదింతల లాభాలను తెచ్చిపెట్టింది. రవితేజ కెరీర్‌లోనే హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన రికార్డు సృష్టించిన ఈ మూవీ ఈనెల 18న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కాబోతుంది.



# పలకరించుకున్న విజయ్, అజిత్.. వైరల్

లండన్ వేదికగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. కోలీవుడ్‌లో బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా భావించే తమిళనాడు సీఎం విజయ్, అజిత్ రేసింగ్ ట్రాక్‌పై ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పలకరించుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. 15 ఏళ్ల తర్వాత మిచెలిన్ లీ మాన్స్ కప్ రేసింగ్ సందర్భంగా సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌లో తాజాగా వీరిద్దరూ కలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.